بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلِّيْ عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰهُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّةٌ (ఆలె ఇమ్రాన్:124)


# బదర్

తెలుగు వార పత్రిక

Weekly BADAR Qadian Telugu

సంపాదకులు:
సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు:
ముహమ్మద్ అక్బర్

సంపుటి 5

సంచిక 22

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

**28 మే 2020, 04 షవ్వాల్ 1441, హి.ఖ, 28 హిజ్రత్ 1399, హి.శ.**


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*.

اَللّٰهُمَّ اَيِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِكْ لَنَا فِيْ عُمُرِهٖ وَاَمْرِهٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اصْبِرُوْا وَصَابِرُوْا وَرَابِطُوْا وَاتَّقُوا اللّٰهَ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ

" ఓ విశ్వాసులారా! సహనము వహించుడు. సహనము వహించుటకు బోధించుడు. సరిహద్దులను జాగరూకులై కాపాడుడు. మీరు విజేయులగుటకు ధర్మ బద్దులై ప్రవర్తింపుడు." (ఆలే ఇమ్రాన్: 201).

మీ ధైర్య సహసాలను చూసుకొని మురిసిపోకండి.అది కేవలం ఆ దయామయుడైన అల్లాహ్ అనుగ్రహమేనని, అతడు ఏనాడు కూడ ఎవరి స్వచ్ఛమైన కృషిని వృధాచేయడని, అందుకే మన కృషికి ఫలితాన్ని ఇచ్చాడని భావించండి.

నా విశ్వాస మేమనగా, ఒకవేళ మానవుడు ప్రపంచములో అన్ని రకాల అవమానాల నుండి, ఇబ్బందుల నుండి కాపాడబడాలని భావించబడినచో అతని కొరకు ఒకే ఒక మార్గం గలదు. అది అతడు నిష్టాపరుడిగా మారడం. అలా మారినచో అతనికి ఎలాంటి సమస్య ఎదురవ్వదు.

**ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

మీ ధైర్య సహసాలను చూసుకొని మురిసిపోకండి. అంతేగాకుండా విజయమనేది మీ శ్రమ, అర్హత వలన లభించినదని భావించకండి. అది కేవలం ఆ దయామయుడైన అల్లాహ్ అనుగ్రహమేనని, అతడు ఏనాడు కూడ ఎవరి స్వచ్ఛమైన కృషిని వృధాచేయడని, అందుకే మన కృషికి ఫలితాన్ని ఇచ్చాడని భావించండి. అలా కానిచో, కొన్ని వందల మంది విద్యార్థులు ప్రతి సంవత్సరం వారి వారి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోవడంను మీరు చూడడం లేదా?. వారందరు శ్రమించని వారేనా?. వారందరు మూర్ఖులు, అసమర్ధులేనా?. కాదు అలా ఎన్నడు కాదు. వారిలో అనేకులు తెలివిగలవారు, చురుకైన వారు కూడ ఉంటారు. ఉత్తీర్ణత సాధించిన వారికన్న కూడ ఎంతో తెలివైన వారు ఉంటారు. అందుకే ప్రతి విజయం తరువాత ఒక విశ్వాసి అల్లాహ్ తాలా ఆస్థానంలో మోకరిల్లుచూ, తన శ్రమను వృధా కానివ్వలేదని అతనికి కృతజ్ఞతలు తెలుపవలెను. అలా కృతజ్ఞతలు తెల్పినందు వలన అల్లాహ్ తాలా పట్ల ప్రేమాభిమానాలు పెరుగుతాయి. పైగా విశ్వాసం కూడ పటిష్టమవుతుంది. కేవలం ఈ విజయాలే కాకుండా మరల కూడ అనేక విజయాలు చేకూరుతాయి. ఎందుకనగా అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. ఒకవేళ మీరు నా అనుగ్రహాలకు కృతజ్ఞతలు తెల్పుచున్నచో నేను మీకు మిక్కిలి అధికముగా అనుగ్రహించెదను. ఒకవేళ అహంకారమును చూపినచో చాలా కఠినమైన శిక్షకు గురి అవుతారు.

**విశ్వాసి మరియు అవిశ్వాసి విజయాలలో వ్యత్యాసం:**

ఈ ప్రాథమిక సూత్రాన్ని ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ఒక విశ్వాసికి ఏదేని విషయంలో విజయం వరించినచో అతడు కృతజ్ఞతతో దేవుడు తనను అనుగ్రహించాడని దేవుని వైభవమును కొనియాడుతాడు. అలా అతడు అడుగులు ముందుకు వేస్తూ ఉంటాడు. ప్రతి కష్టములో కూడ నిలకడను ప్రదర్శిస్తూ దేవుని నుండి బహుమతిని పొందుతాడు. చూడడానికి ఒక హైందవుని, ఒక విశ్వాసుని విజయం ఒకే పోలికను కల్గి ఉండవచ్చును. కాని అవిశ్వాసుడి విజయం అతనిని మార్గభ్రష్టత్వం వైపు తీసుకెళ్ళుతుంది. కాని ఒక విశ్వాసుడి విజయం అతని కొరకు మిక్కిలి అనుగ్రహాలకు దారులు తెరుస్తుంది. అవిశ్వాసుడి విజయం అతనిని మార్గభ్రష్టత్వం వైపు ఎందుకు తీసుక వెళ్ళుతుందనగా, అతడు దేవుని ముందు మోకరిల్లడు. పైగా తన కృషిని, పట్టుదలను, వివేకమును దైవంగా భావించును. కాని ఒక విశ్వాసి దేవుని సన్నిధిలో మోకరిల్లుతూ దేవుని వద్ద తనకంటూ ఒక నూతన పరిచయాన్ని ఏర్పర్చుకుంటాడు. అలా ప్రతి విజయం తరువాత అతడు తన దేవుని సన్నిధిలో ఒక నూతన వ్యవహారంను పొందుతాడు. అలా ఆ విశ్వాసిలో ఒక మార్పు ఏర్పడుతుంది. ఇన్నల్లాహ మ అల్లజీన అత్తఖౌ (అన్నహల్ : 129) అల్లాహ్ నిష్టాపరులకు ఎల్లప్పుడు తోడుగా ఉంటాడు. పవిత్ర ఖుర్ఆన్‌లో నిష్టాపరత అనే పదం అనేక సార్లు ప్రస్తావించబడింది. దాని అర్థమును దాని ముందు ఉన్నటు వంటి పదాన్ని అనుసరించి అనువాదం చేయడం జరుగుతుంది. కాని ఇక్కడ ఆ పదానికి ముందు మఅ అనే పదం వచ్చింది. అనగా ఎవరైతే దేవునికి అధిక ప్రాధాన్యత నిచ్చెదరో అల్లాహ్ కూడ వారికే ప్రాధాన్యత నిచ్చును. ఆపై ప్రపంచములోని అన్ని రకాల అవమానాల నుండి కాపాడును. ఈ అంశంలో నా విశ్వాస మేమనగా, ఒకవేళ మానవుడు ప్రపంచములో అన్ని రకాల అవమానాల నుండి, ఇబ్బందుల నుండి కాపాడబడాలని భావించబడినచో అతని కొరకు ఒకే ఒక మార్గం గలదు. అది అతడు నిష్టాపరుడిగా మారడం. అలా మారినచో అతనికి ఎలాంటి సమస్య ఎదురవ్వదు. కావున విశ్వాసుడి విజయాలు అతనిని ఎల్లప్పుడు ముందుకే తీసుకెళ్ళుతాయి. అతడు ఒకేచోట నిలకడగా ఉండడు.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 134)

## ఖాదియాన్ దారుల్ అమాన్‌లో ఉపశాఖల వార్షిక సమావేశాల నిర్వాహణ:

**సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ కరుణతో భారతదేశపు ఉపశాఖల (అన్సారుల్లాహ్, ఖుద్ధాముల్ అహ్మదియ్య, లజ్నా ఇమాఅల్లాహ్) వార్షిక ఇజ్తిమాల కొరకు 16,17,18 అక్టోబర్, 2020 తేది (శుక్రవారం, శనివారం, ఆదివారం)లను అనుమతించ్చారు.**

**కావున ఉపశాఖలకు చెందిన సభ్యులు మరియు సభ్యురాల్లందరు ఖాదియాన్ దారుల్ అమాన్‌లోని ఆధ్యాత్మిక వాతవరణంలో నిర్వహించే ఈ వార్షిక సమావేశంలో పాల్గొనుటకు నేటి నుండే దుఆలు చేస్తూ సంకల్పంతో సన్నహాలు ప్రారంభించగలరు. ఈ సమావేశములు శిక్షణకు ఎంతో ఉపయోగపడును.**


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**అపార దయామయుడు అడుగనదే ఇచ్చువాడు, పరమకారుణ్య మూర్తి అల్లాహ్ పేర.**

సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తఆలా బినస్రిహిల్అజీజ్ దివి: 12-2-2016 నాటి జుమా ప్రసంగంలో జమాఅత్ అభివృద్ధి కొరకు, మరియు వ్యతిరేకుల దుష్టత్వము, దౌర్జన్యముల నుండి జమాఅత్ సభ్యులందరు రక్షించబడుటకు మరల జమాఅత్ సభ్యులకు దుఃఆల వైపు, ఆధ్యాత్మిక కార్యక్రమాల వైపు శ్రద్ధ చూపించుచు ఈ విధముగా పేర్కొనిరిః " కొన్ని సం॥ల క్రితం జమాఅత్ సభ్యులకు ఉపవాసములు ఉండవలెనని నేను కూడ చెప్పితిని.... దీనిని ఆచరించువారు జమాఅత్‌లో ఇప్పటికి కొందరున్నారు. కనీసం మనమిప్పుడు 40 ఉపవాసములు వారానికొకటి చొప్పున అనగా ప్రత్యేకముగా 40 వారాల వరకు ఉపవాసము లుండవలెను. దుఆలు చేయుము, నఫిల్ నమాజులు చదువుము, దానములు చేయుము, ఎందుకనగా జమాఅత్‌లలో కొనసాగుచున్న స్థితులను బట్టి కొన్ని చోట్ల చాలా కఠినత్వము వచ్చుచున్నది. ఏవిధముగా పిల్లవాడు రోధించినప్పుడు తల్లి ఛాతిలో పాలు వచ్చినట్లే మనము అల్లాహ్‌తఆలా ఆస్థానములో రోధించినప్పుడు ఆకాశము నుండి మన పోషకుని సహాయము అవతరించును. ఇన్షాఅల్లాహ్. మన మార్గములో గల అవరోధములు, కష్టములు దూరమగును. గతములో కూడ దూరమైనవి, ఇప్పుడు కూడ ఇన్షాఅల్లాహ్ దూరమగును." కావున జమాఅత్ సభ్యులు ఈ క్రింది దు:ఆలను పఠించగలరని కోరడమైనది.

1, ప్రతి వారం ఒక నఫిలి ఉపవాస వ్రతాన్ని పాటించిలి. దీని కొరకు స్థానికముగా వారములో ఏదైన ఒక రోజును గ్రామస్థులు లేదా పట్టణస్థులు నిర్ణయించుకోవాలి.

**2, ప్రతి రోజు రెండు రకాతుల నఫిలి నమాజ్‌ను సలుపవలెయును. ఈ నఫిలి నమాజ్‌ను నమాజే జొహర్ తరువాత, లేదా నమాజే ఇషా తరువాత నుండి నమాజ్ ఫజర్ వరకు ఈ నమాజ్‌ను సలుపవచ్చును.**

3, **బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం. అల్ హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. అర్రహ్మానిర్రహీం. మాలికి యౌమిద్దిన్. ఇయ్యాక నాబుదు, వ ఇయ్యాక నస్తయీన్. ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ, సిరాతల్లజీన అన్అమ్‌త అలైహిం, ఘైరిల్ మఘ్‌జూబి అలైహిం వలజ్జాలీన్. (ఆమీన్ )**

**అనువాదము:** అపార దయామయుడు అడుగనిదే ఇచ్చువాడు పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర, ఆ సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనలు. అపార దయామయుడు, పరమ కారుణ్యమూర్తి. అంతిమ దినమున జరుగు ధర్మ నిర్ణయమునకు అధినేత. మేము నిన్నే ఆరాధింతుము. మేము నీ సహాయమునే అర్థింతుము. మమ్ము సత్పధమున నడిపించుము. నీ అనుగ్రహమునకు పాత్రులైన వారు ప్రవర్తించు మార్గమునందును, నీనిరాకరణమునకు గురి కాని వారి మార్గమునందును, సత్పధమును వదలనివారి మార్గము నందును మమ్ము నడిపింపుము.

**(ప్రతి రోజు సమారు 7 పర్యాయములు చదువలయును)**

4, **రబ్బనా అఫ్‌రిఘ్ అలైనా సబ్‌రన్ వ సబ్బిత్ అక్‌దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్. (అల్ బఖరహ్ 251)**

అనువాదము: ఓ మా ప్రభువా! మాపై సర్వక్షమాశక్తిని వర్షింపుము. (యుద్ద రంగమున) మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము. అవిశ్వాసులతో మేము సల్పుచున్న పోరాటమునందు మాకు సహాయమును అందించుము.

**(ప్రతి రోజు సమారు 11 పర్యాయములు చదువలయును)**

**5, రబ్బనా లాతుజిఘ్ ఖులూబనా బాద ఇజ్‌హదైతనా వ హబ్‌లనా మిల్లదున్‌కా రహ్మతన్ ఇన్నక అంతల్ వహ్హాబ్ ( ఆలే ఇమ్రాన్: 9)**

అనువాదము: ఓ మా ప్రభువా! నీ ఉపదేశమును మేము పొందిన తరువాత మా హృదయములు చంచలములు కాకుండు గాక! మాకు నీ అనుగ్రహమును ప్రసాదింపుము. నిశ్చయముగా నీవు ఒక్కడివే వర ప్రదాతవు.

**(ప్రతి రోజు సమారు 33 పర్యాయములు చదువలయును)**

**6, అల్లాహుమ్మ ఇన్నా నజ్‌అలుకా ఫి నుహూరిహిం వ నవూజు బిక మిన్ షురూరిహం.**

అనువాదము: ఓ మా ప్రభువా! మేము నిన్ను శతుఋవుల ఎదుట డాలుగా చేసెదము, మరియు వారి దౌష్ట్య, హానికర ప్రభావాల నుండి నీ శరణమును కోరెదము

**(ప్రతి రోజు సమారు 11 పర్యాయములు చదువలయును)**

**7, అస్తఘ్ ఫిరుల్లాహ రబ్బీ మిన్‌కుల్లి జన్‌బిన్ వ అతూబు ఇలైహి.**

అనువాదము: నా పాపముల క్షమాపణ కొరకు అల్లాహ్‌ను యాచింతును. అతడు నా ప్రభువు! అతని వైపే నేను మోకరిల్లుతును.

**(ప్రతి రోజు సమారు 33 పర్యాయములు చదువలయును)**

**8, సుబ్‌హానల్లాహి వబిహందిహీ, సుబహానల్లాహిల్ అజీమ్. అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ ఆలె ముహమ్మద్.**

అనువాదము: అల్లాహ్ తాలా తన ప్రశంసలతో పవిత్రుడు. పవిత్రుడు మరియు చాలా గొప్పవాడు. ఓ అల్లాహ్! నీవు ముహమ్మద్ మరియు అతని సంతానముపై తమ అనుగ్రహమును అవతరింప జేయుము.

**(ప్రతి రోజు సమారు 33 పర్యాయములు చదువలయును)**

**9, అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వఅలా ఆలె ముహమ్మదిన్, కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలె ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలె ముహమ్మదిన్ కమా బారక్‌తా అలా ఇబ్రాహీమ వ అలా ఆలె ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.**

అనువాదము: ఓ అల్లాహ్! నీవు ఇబ్రామీమ్ మరియు ఇబ్రాహీమ్ సంతానంపై ప్రత్యేక అనుగ్రహము అవతరింపజేసిన విధముగా ముహమ్మద్ మరిము ముహమ్మద్ సంతానంపై కూడ తమ ప్రత్యేక అనుగ్రహమును అవతరింపజేయుము. నిశ్చయముగా నీవు సర్వగుణ సంపన్నుడవు, వైభవోపేతుడవు. ఓ అల్లాహ్! నీవు ఇబ్రామీమ్ మరియు ఇబ్రాహీమ్ సంతానంపై శుభములు అవతరింపజేసిన విధముగా ముహమ్మద్ మరిము ముహమ్మద్ సంతానంపై కూడ తమ శుభములను అవతరింపజేయుము. నిశ్చయముగా నీవు సర్వగుణ సంపన్నుడవు, వైభవోపేతుడవు.

**(ప్రతి రోజు సమారు 7 పర్యాయములు చదువలయును)**

**10, రబ్బి కుల్లి షైయిన్ ఖాదిముక,రబ్బి ఫ ఆఫిజ్‌ని,వన్‌సుర్‌ని, వర్ హమ్‌ని.**

అనువాదము: ఓ నా ప్రభువా! సమస్తం నీ సేవ కొరకై ఉన్నది. ఓ నా ప్రభువా! నన్ను రక్షించుము, నాకు సహాయం అందించుము, నన్ను అనుగ్రహింపుము.

**11, రబ్బనా అఘ్‌ఫిర్‌లనా జునూబనా వ ఇస్రాఫనా ఫీ అమ్రినా వ సబ్బిత్ అఖ్‌దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్.**

అనువాదము: ఓ మా ప్రభువు మా పాపములను మరియు మా విధి నిర్వాహాన అవకతవకలను క్షమించుము. ( యుద్దరంగమున) మడమ తిరుగని అడుగులను ప్రసాదించుము.అవిశ్వాసులతో మేము సల్పుచున్న పోరాటమునందు మాకు సహాయమును అందించుము.

**12, యా రబ్బి ఫస్‌మఅ దుఅయీ వ మజ్జిక్ ఆదాఅక వ ఆదాయీ, వఅన్‌జుజ్ వాదక, వ అన్‌సుర్ అబ్దక, వ అరినా అయ్యామకా, వ షహ్హిర్‌లనా హుసామక, వలా తజర్ మినల్ కాఫిరీన షరీరా.**

అనువాదము: ఓ నా ప్రభువా! నీవు నా ప్రార్ధనలను ఆలకించుము.మరియు నీ శత్రువులను, నా శత్రువులను తూనతుకలు చేయుము.మరియు నీ వాగ్దానమును పూర్తిచేయుము. నీ భక్తులకు సహాయమును నొసంగుము. మాకు మా (శుభప్రదమైన) దినములను తిలకింపజేయుము, మా కొరకు నీవు ఖడ్గము చేత భూనుము. ధిక్కరించు వారిలో ఏ ఒక్క దుష్టిడిని వదలకుము.

హుజూరు గారి ఆదేశము మెరకు తెలుగు బదర్ అరబ్బి ఉచ్చరణ తెలియని వారి కొరకు తెలుగు ఉచ్చరణలో అరబ్బిపదములను, వాటి అనువాదమును ప్రచురించుచున్నది. కావున అహ్మదీయులందరు ఈ సదావకాశమును వినియోగించుకొనుచు, హుజూరు గారి ఆదేశము ప్రకారము ప్రతేక శ్రద్దతో అసంఖ్యాకముగా ఈ దు:ఆలను పఠించుచు అహ్మదియ్యత్ అభివృద్దిలో భాగస్వాములు కాగలరని కోరుకొనుచున్నాము................

# జుమా ప్రసంగం

అల్లాహ్ తఆలా కృపానుసారము రేపటి నుండి రమజాన్ ప్రారంభ మగుచున్నది. మన ఆధ్యాత్మిక ప్రగతి కొరకు అల్లాహ్ తఆలా రమజాన్ ఉపవాసములను విధించెను. నేను పఠించిన పవిత్ర ఖుర్ఆన్ మొదటి సూక్తిలో అతడిట్లనెను. మీరు నిష్టాపరులగుటకే మీపై ఉపవాసములు విధిగావించబడెను. నిష్టాపరత అనగానేమి? దీనిని వివరిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి:

" నిష్టాపరత అనగా మానవుడు అల్లాహ్ తఆలా న్యాసములన్నిటిని, విశ్వాస ప్రతిజ్ఞను, ప్రాణుల న్యాసములన్నిటిని, ప్రతిజ్ఞను సాధ్యమైనంత వరకు నెరవేర్చవలెను. అనగా వాటిలోని చిన్న చిన్న అంశములను సైతం శక్తిమేర పాటించవలెను."

మానవుడు ఈ సంకల్పము, ఈ ఉద్దేశముతో ఉపవాసములుంటూ, రమజాన్ నెలను గడిపినచో, సదుద్దేశముతో గడిపినచో ఏర్పడినటు వంటి మార్పు తాత్కాలికమైనది కాకుండా, ఒక శాశ్వతమైన మార్పుగా నిలుస్తుంది. అనంతరం అల్లాహ్ తాలా హక్కులను చెల్లించు విషయంలో కూడ శాశ్వత శ్రద్ధ ఏర్పడుతుంది. ప్రార్థనల హక్కులు చెల్లించు విషయంలో కూడ శ్రద్ధ ఏర్పడుతుంది. ఫలితముగా ప్రాపంచిక కార్యకలాపాలు, వ్యర్థ ప్రయసాలు ఆధిక్యతను చాటవు. అలా మానవుల హక్కులను చెల్లించు విషయంలో కూడ సాధారణ శ్రద్ధ ఏర్పడుతుంది. ఆపై మన స్వప్రయోజనాల కోసం ప్రజల హక్కులను హరించని స్థితికి చేరుకుంటాము.

మానవునికి అల్లాహ్ తాలా అనుగ్రహించిన శక్తులన్నింటిని పూర్తి స్థాయిలో ఉపయోగించి, ఆ తరువాత ఫలితాన్ని కూడ అల్లాహ్‌కే వదిలివేయును. ఆపై దేవునితో ఈ విధముగా వేడుకొనును. నీవు నాకు కల్పించిన అవకాశం మేరకు నేను వాటితో పనులు తీసుకున్నాను. ఇది ఇయ్యాక న అబుదూ యొక్క అర్థం. మరల ఇయ్యక నస్తయీన్ అని పలుకుచూ దేవుని నుండి సహాయమును ఆశించును. తరువాత కార్యక్రమాల విషయంలో నేను నీ సహాయాన్ని ఆర్జించుచున్నాను.

దుఆలు కూడ చేయండి. ఉపవాసములు పాటించుటకు అనుగ్రహాన్ని కల్పించమని అల్లాహ్ తాలాతో దుఆలు కూడ చేయవలెను. ఈ రోజులలో ప్రత్యేకించి చాలా దుఆలు చేయవలెను. అల్లాహ్ తాలా మానవజాతికి బుద్ధిని ప్రసాదించుగాకా!. అల్లాహ్ తాలాను వీరు గుర్తించుదురు గాకా!, అల్లాహ్ తాలా ఈ మహామ్మారిని త్వరగా ప్రపంచము నుండి అంతమొందించుగాకా!, ప్రపంచమును కరిణించుగాకా! అహ్మదీయులమైన మనమందరం కూడ నిష్టాపరతను అనుసరిస్తూ అల్లాహ్ మరియు అతని దాసుల హక్కులను చెల్లించువారలము కావలెను. రమజాన్ మాసపు శుభములన్నింటిని అధిక మోతాదులో సమకూర్చువారలము కావలెను.

అల్లాహ్ తాలా మనందరికి దుఆలు చేయు భాగ్యమును కల్పించుగాకా!, తమ తమ స్థితి గతులను పరీక్షించుకునే భాగ్యమును ప్రసాదించుగాకా!, ప్రపంచానికి, ప్రపంచములో ఉన్నటువంటి అగ్రరాజ్యాలకు తమ తమ కార్యాచరణలను రూపొందించుకునే, వాటికి అనుగుణముగా ఆచరించుకునే భాగ్యమును, వివేకంను కల్పించుగాకా!. (ఆమీన్).

**సయ్యద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 24 ఏప్రిల్ 2020 ( 24 షహాదత్ 1399 హి.ష) తేదీన మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ప్రసంగం.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ـ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ـ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ـ

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ـ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ـ

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ـ

يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُوْنَ ○ اَيَّامًا مَّعْدُوْدٰتٍ ؕ فَمَنْ كَانَ مِنْكُمْ مَّرِيْضًا اَوْ عَلٰى سَفَرٍ فَعِدَّةٌ مِّنْ اَيَّامٍ اُخَرَ ؕ وَعَلَى الَّذِيْنَ يُطِيْقُوْنَهٗ فِدْيَةٌ طَعَامُ مِسْكِيْنٍ ؕ فَمَنْ تَطَوَّعَ خَيْرًا فَهُوَ خَيْرٌ لَّهٗ ؕ وَاَنْ تَصُوْمُوْا خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ○ شَهْرُ رَمَضَانَ الَّذِيْٓ اُنْزِلَ فِيْهِ الْقُرْاٰنُ هُدًى لِّلنَّاسِ وَبَيِّنٰتٍ مِّنَ الْهُدٰى وَالْفُرْقَانِ ۚ فَمَنْ شَهِدَ مِنْكُمُ الشَّهْرَ فَلْيَصُمْهُ ؕ وَمَنْ كَانَ مَرِيْضًا اَوْ عَلٰى سَفَرٍ فَعِدَّةٌ مِّنْ اَيَّامٍ اُخَرَ ؕ يُرِيْدُ اللّٰهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيْدُ بِكُمُ الْعُسْرَ ۫ وَلِتُكْمِلُوا الْعِدَّةَ وَلِتُكَبِّرُوا اللّٰهَ عَلٰى مَا هَدٰىكُمْ وَلَعَلَّكُمْ تَشْكُرُوْنَ ○

ఈ సూక్తుల అనువాదమిట్లు గలదు. అనగా ఓ విశ్వాసులారా! మీరు ధార్మికులు కావలయునని మీ కంటే పూర్వమున్న వారికి విధించబడినట్లే మీకును ఉపవాస నియమము విధించబడినది.

రెండవ సూక్తి అనువాదమిట్లు గలదు: ఈ ఉపవాస నియమము నిశ్చిత దినములకే పరిమితమైనది, కాని మీలో ఎవరికైనను అనారోగ్యమున్న గాని, ప్రయాణమునందున్న గాని ఆ దినములలో ఉపవాసము చేయక మరెప్పుడైనను ఉపవాసమును పాటించి ఆ సంఖ్యను పూర్తి చేయవలెను. సామర్థ్యమున్న వారు ఒక పేదవానికి అన్నము తినుపించుట పరిహారము. ఎవ్వరైనను సత్కార్యము చేసినచో అతనికి అది చాలా మంచిది. మీరు తెలిసి ఉపవాస నియమమును పాటించినచో మీకది మంచిది. మానవులకు హితోపదేశముగా స్పష్టమైన నిరూపణములతో, సత్యాసత్యముల తారతమ్యమును వివరించు అంశములతో,

ఖుర్ఆన్ రమజాన్ మాసములో అవతరింపబడెను. కనుక మీలో ఎవరైనను ఈ మాసము పొందినచో ఉపవాస నియమమును పాటించవలయును. అనారోగ్యముగా నున్నవారు, ప్రయాణములో నున్నవారు తరువాతి దినములలో ఉపవాస నియమము పాటించి ఆ సంఖ్యను పూర్తి చేయవలయును. మీకు సౌకర్యము కలిగించట అల్లాహ్ ఉద్దేశము. మీకు కష్టము కలిగించుట కాదు. కనుక (సౌకర్యముతో) సంఖ్యను పూర్తి చేయుము. మీరు కృతజ్ఞులగుటకు అతడు ప్రసాదించిన హితోపదేశముతో అల్లాహ్ మహిమను కొనియాడుము. (అల్ బఖరహ్:184-186)

అల్లాహ్ తఆలా కృపానుసారము రేపటి నుండి రమజాన్ ప్రారంభ మగుచున్నది. మన ఆధ్యాత్మిక ప్రగతి కొరకు అల్లాహ్ తఆలా రమజాన్ ఉపవాసములను విధించెను. నేను పఠించిన పవిత్ర ఖుర్ఆన్ మొదటి సూక్తిలో అతడిట్లనెను. మీరు నిష్టాపరులగుటకే మీపై ఉపవాసములు విధిగావించబడెను. నిష్టాపరత అనగానేమి? దీనిని వివరిస్తు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇట్లనిరి:

" నిష్టాపరత అనగా మానవుడు అల్లాహ్ తఆలా న్యాసములన్నిటిని, విశ్వాస ప్రతిజ్ఞను, ప్రాణుల న్యాసములన్నిటిని, ప్రతిజ్ఞను సాధ్యమైనంత వరకు నెరవేర్చవలెను. అనగా వాటిలోని చిన్న చిన్న అంశములను సైతం శక్తిమేర పాటించవలెను." (జమీమా బరాహీనే అహ్మదియ్యా భాగం 5, రుహాని ఖజాయిన్ సంపుటి 21, పుట 210)

అనగా న్యాసములను, ప్రతిజ్ఞలను వాటిలోని చిన్న చిన్న కోణములను గుర్తుంచుకొని వాటిని నెరవేర్చేటకు కంకణబద్ధుడు కావలెను. ఇది సులభమైన విషయము కాదు. అల్లాహ్ తఆలా హక్కులు, ప్రాణుల హక్కుల పట్టిక సిద్ధము

చేసుకున్నచో మనిషి అయోమయానికి గురగును. అల్లాహ్ తఆలా ప్రార్థన హక్కును మనము చెల్లించలేము. అల్లాహ్ తఆలా మనపై అధికముగా ఉపకరించి నందున అతనికి కృతజ్ఞత తెలుపుట మన ధర్మము. ఈ కృతజ్ఞత హక్కును కూడ మనము చెల్లించడము లేదు, చెల్లించలేము కూడ ఇలా చెల్లించకుండానే అధికులు అల్లాహ్ తఆలా వరములతో ప్రయోజనము పొందుతుంటారు. మనపై హక్కు గావించబడినను, మన స్థితిగతులును, మన కృతఘ్నతను పట్టించుకోకుండా అల్లాహ్ తఆలా మనందరిని కనికరిస్తుంటాడు. ఇది కూడ అతని ఉపకారమే అనబడుతుంది. అల్లాహ్ తఆలాతో చేసిన మన ప్రతిజ్ఞలను మనము పూర్తి చేయడము లేదు. ప్రాణుల హక్కులు గలవు, తల్లిదండ్రుల హక్కులు గలవు, పొరుగువారి హక్కులు గలవు, బాటసారుల హక్కులు గలవు, సమాజ హక్కులు గలవు వాటిని మనము చెల్లించడము లేదు. వాటిని చెల్లించుమని ఆదేశించబడినను మనము వాటిని చెల్లించడము లేదు. మనము క్షుణ్ణంగా పరిశీలించినచో మనము అల్లాహ్ తఆలా హక్కులను చెల్లించడం లేదు, దాసుల హక్కులను కూడ చెల్లించడం లేదు. నేను ఒక సాధారణ పట్టికను సిద్ధము చేయించాను. అందులో చాలా ముఖ్యమైన హక్కులను మాత్రమే చేర్చబడెను. అందులో దాసుల హక్కులు, అల్లాహ్ తఆలా ప్రాణుల హక్కులే గలవు. అయినను అవి 28, 29 సమకూరినాయి. ఏది ఏమైనప్పటికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి: నిజమైన విశ్వాసము ఏమనగా, నిష్టాపరత ఆశించునదేమనగా అల్లాహ్ తఆలాతో చేసిన వాగ్దానములను పూర్తి చేయండి. అతి సూక్ష్మమైన హక్కులను కూడ పూర్తి చేయండి. అదే విధంగా అతని న్యాసముల హక్కును కూడ చెల్లించండి. అతి సూక్ష్మమైన న్యాసములను కూడ చెల్లించండి. అదే విధముగా ప్రాణులతో చేసిన వాగ్దానములను కూడ అతి సూక్ష్మమైన విధానములో చెల్లించండి. వారి న్యాసములను ఒక చింతనతో చెల్లించండి. అప్పుడే అది నిష్టాపరత అనబడుతుంది. అల్లాహ్ తఆలా ఇట్లు తెలిపెను. రమజాన్ మాసమును ఎందుకు నియమించామనగా, ఉపవాసములు ఉండమని ఎందుకు ఆదేశించామనగా, గత 11 మాసాలలో హక్కులను చెల్లించు విషయంలో జరిగిన లోటుపాటులను దూరం చేసుకొనుటకు ఈ మాసములో విధిగా అల్లాహ్ తఆలా వైపు దృష్టి సారిస్తూ, అల్లాహ్ తఆలా కొరకు ధర్మబద్ధమైన విషయములను వీడుతు, అల్లాహ్ తఆలా కొరకు ఆకలి, దప్పికను భరిస్తు, అల్లాహ్ తఆలా ప్రార్థనలో గతము కంటే ఎక్కువ శ్రద్ధ చూపుతు దాసుల హక్కులు చెల్లించుటకు ప్రత్యేక దృష్టి సారించాలి. ఇలా చేసినప్పుడే నిష్టాపరత అనబడును. రమజాన్ మరియు ఉపవాసముల ఉద్దేశము కూడ ఇదే. కావున మానవుడు ఈ సంకల్పము, ఈ ఉద్దేశముతో ఉపవాసములుంటూ, రమజాన్ నెలను గడిపినచో, సదుద్దేశముతో గడిపినచో ఏర్పడినటు వంటి మార్పు తాత్కాలికమైనది కాకుండా, ఒక శాశ్వతమైన మార్పుగా నిలుస్తుంది.

అనంతరం అల్లాహ్ తాలా హక్కులను చెల్లించు విషయంలో కూడ శాశ్వత శ్రద్ధ ఏర్పడుతుంది. ప్రార్థనల హక్కులు చెల్లించు విషయంలో కూడ శ్రద్ధ ఏర్పడుతుంది. ఫలితముగా ప్రాపంచిక కార్యకలాపాలు, వ్యర్థ ప్రయసాలు ఆధిక్యతను చాటవు. అలా మానవుల హక్కులను చెల్లించు విషయంలో కూడ సాధారణ శ్రద్ధ ఏర్పడుతుంది. ఆపై మన స్వప్రయోజనాల కోసం ప్రజల హక్కులను హరించని స్థితికి చేరుకుంటాము. కావున మనము ఈ ఉద్దేశము, ఈ సంకల్పముతో ఉపవాసముండనిచో మనము రమజాన్‌లో ప్రవేశించుట కూడ నిష్ప్రయోజనమే అగును. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సందర్భమున ఇట్లు ఉపదేశించిరి. ఎవరైనా అల్లాహ్ తఆలా మార్గములో అతని శుభమును ఆశిస్తు ఉపవాసమున్నచో అల్లాహ్ తఆలా అతని ముఖానికి మరియు నరకానికి మధ్య 70 ఖరీఫ్‌ల ప్రయాణపు దూరాన్ని ఏర్పాటు చేయును. (సహి బుఖారి, కితాబుల్ జిహాద్ వ స్సీర్, బాబ్ ఫజలు స్సామ్ ఫి సబీలుల్లాహ్, హదీస్ 2840).

అనగా ఒక ఋతువుకు మరొక ఋతువుకు మధ్య నున్న కాలము. ఆకురాలు కాలము లేదా చలి కాలము నుండి మరల వచ్చే చలి కాలము వరకు ఎంత కాలముండునో అది 70 ఖరీఫ్‌ల దూరమును ఏర్పాటు చేయును. అనగా ఒక ఖరీఫ్ నుండి రెండవ ఖరీఫ్ వరకు ఒక సంవత్సర కాలమగును. ఇలా 70 సంవత్సరములకు సమానమగు దూరాన్ని ఏర్పాటు చేయును. ఇవి ఉపవాస శుభములు అనగా ఉపవాసము ఇటువంటి నిష్టాపరతను కలిగించును. ఉపవాసము 30 రోజులకు మాత్రమే నిష్టాపరతను పుట్టించదు. నిజమైన ఉపవాసము 70 సంవత్సరముల వరకు ప్రభావమును చూపుతుంది. ఈ విధంగా మనము లెక్కించినచో ఉపవాసములు విధిగావించిన తర్వాత అనగా ఒక ముస్లిం యువకునికి ఉపవాసము అనివార్యమైన తర్వాత అతడు ఉపవాసములతో నిజమైన రీతిలో లబ్ది పొందినచో, దాని వాస్తవికతను అర్థము చేసుకొని ఉపవాసములున్నచో ఆ వ్యక్తి జీవితాంతం ఉపవాసములతో అల్లాహ్ తఆలా పెట్టిన ఈ శుభములతో ప్రయోజనము పొందును. ఉపవాసముల లక్ష్యమైన నిష్టాపరత మార్గములను అన్వేషిస్తు, అల్లాహ్ తఆలా అసంతృప్తి నుండి తప్పించుకొనును. ఇలా అతని ప్రీతిని పొందువాడగును.

ఇటువంటి ఉపవాసదీక్షులు మన సమాజములో ఏర్పడినచో అదెంతటి అందమైన సమాజమగునో ఊహించండి. అచట అల్లాహ్ తఆలా హక్కులు చెల్లించడంతో పాటు దాసుల హక్కులు కూడ చెల్లించబడును. ఈ స్వచ్ఛమైన సమాజమునే నిర్మించుటకు ప్రతి నిజమైన విశ్వాసి ఆశించడంతో పాటు ప్రతి మానవుడు స్థాపించుటకు కృషి చేయును. తమ హక్కుల ప్రశ్న తెలెత్తినచో దీనికి సమాధానమేమనగా నేనింతకు ముందు చెప్పినట్లు సాధారణంగా ప్రజలు తమ కొరకు కోరినది ఇతరుల కొరకు ఆలోచించరు. మీరు తమ కొరకు మాత్రమే ఈ సౌకర్యములను ఆశించక ఇతరుల కొరకు కూడ ఇటువంటి సమాజమును స్థాపించాలని ఇస్లాం ఆదేశిస్తుంది. కేవలం తమ లాభములను మాత్రమే చూడకూడదు, తమ హక్కులను మాత్రమే చూడకూడదు, ఇతరుల హక్కులను రక్షించాలి, వారి పట్ల ఆలోచించాలి.

ఇప్పుడు వ్యాపించిన మహమ్మారి వలన ప్రభుత్వ చట్టములు అధికులను ఇండ్లకే పరిమితం చేసెను. ఇటువంటి పరిస్థితులలో మన సంస్థతో పాటు కొన్ని చోట్ల ఇతరులలో కూడ ఒక మంచి విషయము ఏర్పడెను. మన సంస్థలో ప్రత్యేకంగా ఇటు వైపు శ్రద్ధ కలిగినది. ప్రపంచములోని ప్రతి దేశములో ఖుద్దాముల్ అహ్మదియ్య (యువజన సంఘం) ద్వారా వాలంటీర్లు అవసరమున్న చోట ప్రజలకు నిత్యావసర సరుకులు అందించుటకు లేదా ఇతర వసతులు కల్పించుటకు, మందులు అందించుటకు కృషి చేస్తున్నారు. ఇలా హక్కులు చెల్లించడం వలన, ఇటువంటి ఆదర్శము చూపుతున్నందున మన సభ్యులు ఎలాగు లబ్ది పొందుతున్నారు, ఇతరులు కూడ లబ్ది పొందుతున్నారు. ఇప్పుడు కలిగిన ఈ శ్రద్ధ అనగా మానవ సేవ పట్ల ఏర్పడిన ఈ శ్రద్ధ కేవలం విపత్కర సమయములలో కాక మనలో ఎల్లప్పుడుండవలెను.







వీటితో పాటు ఆధ్యాత్మిక ప్రయోజనాలు అనగా ఏమిటి?. ప్రజలు ఇలా వ్రాస్తున్నారు. ఇంతేగాక ఆధ్యాత్మిక ప్రయోజనములు కూడ కలిగినవి. దీని వలన మా ఇంట్లో ఒక క్రొత్త వాతావరణం ఏర్పడినదని ప్రజలు వ్రాస్తున్నారు. మేము గృహములోనే కూర్చుంటున్నాము. సామూహికంగా నమాజులు చదువుతున్నాము. నమాజుల తర్వాత సంక్షిప్తంగా ధార్మిక పాఠములు చెప్పుకుంటున్నాము. అందరం కలిసి ఖుత్బా వింటున్నాము, ఎమ్.టి.ఏ.లో ప్రసారమయ్యే ఇతర కార్యక్రమాలను తిలకిస్తున్నాము. ఈ లాక్ డౌన్ ఇలాగే పొడిగించబడినచో అనగా రమజాన్ చివరి వరకు ఇది కొనసాగినచో సామూహిక నమాజులు, ధార్మిక పాఠముల వైపు మరింత శ్రద్ధ చూపించుటకు ప్రయత్నించవలెను. చిన్న పిల్లలకు సాధారణ విషయములు నేర్పించండి, బోధించండి. ఇంతకు ముందు కూడ నేనొక ఖుత్బాలో చెప్పినట్లు తమ విద్యను పెంచుకోండి, పిల్లల విద్యను కూడ పెంచండి, దుఆల వైపు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ అల్లాహ్ తఆలా దయను తమతో పాటు ప్రపంచము కొరకు కూడ యాచించండి. అల్లాహ్ తఆలా మనకు అందిస్తున్న ఈ రోజులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవలెను. నేను చెప్పినట్లు ఈ మహమ్మారి అత్యధిక గృహములలో ఏర్పరచిన వాతావరణమును మరింత మెరుగ్గా వినియోగించుటకు శ్రద్ధ చూపవలెను. ప్రాపంచికుల గృహముల వలె మార్చుకోకూడదు. కొందరి గృహములలో జగడములు, అశాంతి, ఆందోళనలు పెరిగినవి. ఒక పుణ్య, మంచి వాతావరణము వైపు మనకు సూచించబడినందున మన గృహ వాతావరణము మెరుగ్గా వుండవలెను. ఇండ్లలో ఏర్పడుతున్న ధార్మిక వాతావరణానికి కొన్ని సార్లు పురుషులు పూర్తిగా భాగస్వాములు కారు. కొన్ని సార్లు మహిళలు తమ భిన్నమైన ప్రాధాన్యతలు కలిగి వుంటారు. ప్రస్తుత పరిస్థితులలో ఎంత వరకు అల్లాహ్ తఆలా వైపు మొకరిల్లుతు అతని ప్రీతిని పొందవలసిన అవసరమున్నదో వీరికి తెలియనే తెలియదు. పిల్లలను కూడ అధికాధికముగా అల్లాహ్ తఆలాకు సన్నిధికి చేర్చుటకు ఇదే మంచి సమయము. మనము అధికాధికముగా అల్లాహ్ తఆలా ప్రేమను ఆకర్షించుటకు, శుభాంతము కొరకు మనలోని ప్రతి అహ్మదీ కుటుంబము ఇటు వైపు చాలా శ్రద్ధ వహించవలసిన అవసరమున్నది. నిష్ఠాపరత వాస్తవమును అర్థము చేసుకొని, దానికి బద్ధులై వుండుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

నిష్ఠాపరతను విభిన్న రకాలలో వివిధ సందర్భములలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వివరించిరి. ఈ కాలపు రక్షణ కోట, దృఢమైన ఆశ్రయము, శరణుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వున్నారు. వారు అల్లాహ్ తఆలాతో మార్గదర్శనము పొంది మనకు ఇస్లాం నిజమైన బోధను ఎంతో చక్కగా వివరించి, చాలా ఆతృతతో అల్లాహ్ తఆలా అతని ప్రవక్త చూపిన మార్గము మనకు చూపించి ఈ రక్షణ కోటలో ప్రవేశించాలని సూచించారు. వారి ఉపదేశములు విని వాటిని పాటిస్తామని ప్రతిజ్ఞ చేసి వారి సంస్థలో చేరిన మనము విధిగా మన ప్రతిజ్ఞను పూర్తి చేయవలసిన అవసరమున్నది. ఎంతో సానుభూతితో ఉచ్చరించిన వారి పదములను గ్రహించి, వాటిని పాటించి, మనము ప్రతిజ్ఞలను పూర్తి చేయువారమైనచో తమ ఇహపరలోకమును కూడ చక్కదిద్దుకొనువారము కావచ్చును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంస్థ సభ్యుల వివిధ సమావేశములలో మన ఆధ్యాత్మిక, నిష్ఠాపరత అభివృద్ధి కొరకు ఉపదేశించిన కొన్ని పంక్తులను నేనిప్పుడు ప్రవేశపెట్టుతాను. నిష్ఠాపరత అంటే ఏమిటి, అదెలా లభించునని ఒక సమావేశములో తెలుపుచు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి.

ముఖ్యమైన విషయమేమనగా మొదట నిష్ఠాపరత అంటే ఏమిటి, అదెలా లభించునో అర్థము చేసుకోండి. చిన్న చిన్న మలినము నుండి దూరముండుటయే నిష్ఠాపరత. దానిని పొందు మార్గమేమనగా పాపము దరి చేరకుండా ప్రణాళికలు రచించి, కేవలం ప్రణాళికలు మాత్రమే సరిపోవునని భావించకూడదు. అనంతరం సరియైన రీతిలో దుఆ చేయవలెను. కూర్చొని, సాష్టాంగములో, రుకులో, నిలబడి, తహజ్జుద్‌లో అనగా ప్రతి స్థితిలో అనుక్షణం ఇదే చింతనలో గడుపుతు అల్లాహ్ తఆలా పాపము, దుష్కార్య మలినము నుండి మోక్షము ప్రసాదించాలని దుఆ చేయవలెను. పాపము, నేరము నుండి మానవుడు సురక్షితమగుట, పవిత్రునిగా, అల్లాహ్ తఆలా దృష్టిలో పుణ్యుడు, సత్యతవంతునిగా మారుట కంటే గొప్ప వరము మరొకటి లేదు. కాని ఈ వరము కేవలం ప్రణాళికతో గాని దుఆతో మాత్రమే గాని లభించదు. కేవలం ప్రయత్నము సరిపోదు. అలాగే దుఆ మాత్రమే సరిపోదు. దుఆ, ప్రణాళిక రెండు పూర్తిగా కలిసినప్పుడే లభించును. ఈ రెండింటిని శక్తిమేర ప్రయత్నించనిచో ఇది లభించదు. దుఆ మాత్రమే చేస్తూ ప్రణాళిక చేయని (ఆచరించని) వ్యక్తి పాపమునకు పాల్పడుతున్నాడు. అల్లాహ్ తఆలాను పరీక్షిస్తున్నాడు. ఇలాగే కేవలం ప్రణాళిక చేస్తూ దుఆ చేయని వ్యక్తి కూడ గర్వమునకు పాల్పడుతున్నాడు. అల్లాహ్ తఆలా అవసరం లేదని భావిస్తూ తమ ఉపాయము, ప్రణాళిక, కండ బలముతో పుణ్యమును పొందదలచినాడు. కండ బలముతో పుణ్యములు లభించవు. మరల ఇట్లనిరి. విశ్వాసుడు, నిజమైన విశ్వాసుడు, నిజమైన ముస్లిం ఎల్లప్పుడు ప్రణాళిక, దుఆ రెండిండితో పని చేయును. బాహ్య కారణములైన ప్రణాళికలు రచించును, వాటిని పూర్తి చేయును. అనంతరం ఈ ససమస్యను అల్లాహ్ తఆలాకు అప్పగించును. ఈ బోధన పవిత్ర ఖుర్ఆన్‌లోని మొదటి సూక్తిలోనే వున్నది. ఇట్లు నుడివెను. ఇయ్యాక నాబుదు వ ఇయ్యాక నస్తయీన్. తమ శక్తులను ఉపయోగించని వ్యక్తి కేవలం శక్తులను బహిర్గతము చేయడమే కాక వాటిని అవమానపరుస్తు పాపమునకు కూడ పాల్పడుతున్నాడు. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 337-338, ఎడిషన్ 1984).

మరల పై అంశమును ఈ విధముగా విశదీకరించి తెలుపడం జరిగింది.

మానవునికి అల్లాహ్ తాలా అనుగ్రహించిన శక్తులన్నింటిని పూర్తి స్థాయిలో ఉపయోగించి, ఆ తరువాత ఫలితాన్ని కూడ అల్లాహ్‌కే వదిలివేయును. ఆపై దేవునితో ఈ విధముగా వేడుకొనును. నీవు నాకు కల్పించిన అవకాశం మేరకు నేను వాటితో పనులు తీసుకున్నాను. ఇది ఇయ్యాక న అబుదూ యొక్క అర్థం. మరల ఇయ్యక నస్తయీన్ అని పలుకుచూ దేవుని నుండి సహాయమును ఆశించును. తరువాత కార్యక్రమాల విషయంలో నేను నీ సహాయాన్ని అర్థించుచున్నాను. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 338-339, అనుబంధం. ఎడిషన్ 1984).

కాని మనం ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, అల్లాహ్ తాలా మన మనో భావాలను , మన ప్రతి పనిని బాగుగా ఎరుగును. అందుకే మన ప్రయత్నాలను చివరి స్థాయి మేరకు చేర్చి సాధ్యమైనంత వరకు





ప్రయత్నించి ఆ తరువాత అతని సహాయాన్ని ఆర్జించాలి. కావున ఈ విషయంలో కూడ మన మనస్సును బాగుగా పరిశీలించు చూసుకోవాలి. నిష్టాపరతతో వ్యవహరిస్తున్నామా? లేదా? అని చూసుకోవలెను. మరల ఇట్లు తెల్పిరి.

"మానవుడు కొన్ని సార్లు ఉపాయంతో ప్రయోజనం పొందుతాడు అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఉపాయాలపైనే పూర్తిగా నమ్మకాన్ని పెంచుకోవడం మూర్ఖత్వము, అవివేకము అనబడుతుంది. ఉపాయాలతో పాటు దుఆలు చేయనంత వరకు ప్రయోజనమే ఉండదు. అదే విధముగా దుఆలతో పాటు ఉపాయాలు లేనిచో ప్రయోజనమే ఉండదు. ఏ కిటికి వలన ఇబ్బంది ఎదురవుతుందో ముందుగా ఆ కిటికిని మూసివేయాలి. ఆ తరువాత ఏ రంధ్రము ద్వారా పాపము లోనికి ప్రవేశిస్తుందో అనగా పాపమునకు, అవిధేయతకు, ధార్మికత నుండి దూరం వెళ్ళిపోవడానికి కారణము ఏదైనను ఆ మార్గాన్ని కూడ వదిలివేయాలి. మరల ఇట్లనిరి. ముందుగా ఆ కిటికిని మూసి వేయాలి. ఆ తరువాత తమ మనస్సులో జరిగే సంఘర్షణ దూరమవడం కోసం దుఆలు చేయాలి. అందువలనే ఈవిధముగా తెలుపడం జరిగింది. వల్లజీనా జాహదు ఫీనా ల నహ్దియన్న హుం సుబులన. (అన్‌కబూత్: 70) మరల ఇట్లనిరి. ఇందులో ఉపాయమును ఆచరించుమని ఏ స్థాయిలో హితోపదేశం చేయబడిందో చూడండి. ఉపాయంలో కూడ అల్లాహ్ తాలా ను వదిలి వేయకూడదు. మరోవైపు ఈ విధముగా తెలియజేస్తున్నాడు. ఉద్ఊని అస్తజిబ్‌లకుం. (అల్ మోమిన్:61) కావున మానవుడు పూర్తి స్థాయిలో నిష్టాపరతను ఆశించుచున్నచో ఉపాయంను ఆలోచించాలి. ఆ తరువాత దుఆలు చేయాలి. రెండింటిని ఆచరించవలసిన స్థాయి మేరకు ఆచరించవలసియుండును. ఇలాంటి స్థితిలో అల్లాహ్ తాలా అతనిని కరుణించును. కాని ఒకటి ఆచరించి రెండవది వదిలి వేసినచో అతడు కోల్పోవును. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 338-339, ఎడిషన్ 1984).

మరల ఈ విషయాన్నే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వివరిస్తూ ఈ విధముగా తెల్పినారు:

"మానవుడు ఏ విధముగానైతే నిష్టాపరతపై నిలుచునో అనగా ఉపాయాల ద్వారా, దుఆల ద్వారా మరల ఇలి తెల్పిరి. ప్రతి పనికి దైవభీతియే మూలం. మరల ఇట్లు తెల్పిరి. మానవుడు ఏ మార్గంలో నిష్టాపరతపై స్థిరపడునో, ఆ విధానము ఏమిటి?. అది ముందే తెలుపబడింది. అనగా ఉపాయము మరియు దుఆలు. ఏదో విధముగా నిష్టాపరతపై స్థిరత్వముగా ఉంటాడు. దైవ నిష్టాపరతయే ప్రతి పనికి మూలాధారము. ఇదిలేని ప్రతి పని వ్యర్థము. నిష్టాపరత వలన ఆచరణలకు అందము కలుగును. నిష్టాపరతయే కార్యాచరణలను అందముగా చూపుతుంది. దాని ద్వారానే అల్లాహ్ తాలా సామిప్యతను పొందగలము. దాని మాధ్యమముగానే దేవుని మిత్రులుగా మారిపోతుంటారు. కావున ఈ క్రమంలో ఈ విధముగా తెలుపబడింది. ఇన్న అవ్‌లియాహుల్ ముత్తఖూన్." (అన్‌ఫాల్: 35)

కావున ఇన్న అవ్‌లియాహుల్ ముత్తఖూన్ ను విశదీకరిస్తూ ఈ విధముగా తెలుపడమైనది.

"దైవ మిత్రుత్వం అనే ఆంశం నిష్టాపరతపై ఆధారపడి ఉంటుంది. అల్లాహ్ తాలా కాళ్ళా వ్రేళ్ళా పడి దానిని సాధించినచో పరపూర్ణ స్థాయికి చేరుకోగలము." (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 340, అనుబంధము)

దేవుని మిత్రులు కావడం అనేది నిష్టాపరతతోనే సాధ్యము. ఒకవేళ దైవభీతి మనస్సులో ఉన్నచో, దేవునికి భయపడుతూ ఉన్నచో మానవుడు ఆ స్థాయికి చేరుకొనును. మరల హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధముగా తెల్పినారు:

"పరిపూర్ణతతో కూడిన నిష్టాపరతలో ఏ ఆంశం తప్పిపోనప్పుడు వారు దేవుని మిత్రులలో చేరిపోతారు. నిష్టాపరత అనేది ఒక పూర్తి స్థాయికి చెందిన మరణం వంటింది. ఎందుకనగా మనస్సును పూర్తి స్థాయిలో వ్యతిరేకించినప్పుడు మనస్సు మృతి చెందును. అందుకోసమే మరణం రాక ముందే మరణించుమని తెలుపడం జరిగింది. మరల ఇట్లనిరి: మనస్సు బహ్యాఅభిరుచులకు ప్రీతికరమై ఉంటుంది. వాస్తవ అభిరుచి అంటే ఏమిటో వీటికి ఏ మాత్రం తెలియదు. అనగా అల్లాహ్ తాలా వైపు నుండి లభించునట్టి అభిరుచులు, మరియు ఆధ్యాత్మిక అభిరుచులు అవన్నియు గోప్యమైన అభిరుచులు వాటిని గూర్చిన అవగాహన లేదు. బాహ్యా ప్రపంచములో ఉన్నటు వంటి అభిరుచులను మాత్రమే మానవుడు ఎరుగును. మనస్సు కూడ వాటినే కోరుకుంటుంది. మరల ఇట్లు తెలుపబడెను. మనస్సును హెచ్చరించుటకై ముందుగా బాహ్యా అభిరుచులను పూర్తిగా వదిలి వేయాలి. ఆ తరువాత మనస్సుకు వాస్తవమైన అభిరుచులు తెలియును. బాహ్యా అభిరుచులను పూర్తిగా వదిలి వేసినప్పుడే మనస్సుకు ఆధ్యాత్మిక అభిరుచులను గూర్చిన అవగాహన కల్గుతుంది. ఆ తరువాతయే స్వర్గజీవితానికి ఉదాహరణ అయినటువంటి ఆధ్యాత్మిక అభిరుచుల అనుభూతి ప్రారంభమగును. గోప్యమైన అభిరుచుల అవగాహన తెలిసినప్పుడు స్వర్గ జీవితపు మాదుర్యం లభించును. మరల వారు జమాఅత్ సభ్యులనుద్దేశించి ఇట్లనిరి. కావున మన జమాఅత్ సభ్యులు తమ మనోవాంచలను పూర్తిగా విడనాడాలి. ఈ ఉపదేశం దైవ మిత్రులకు, లేదా ఉన్నత స్థాయి గల ఆధ్యాత్మిక వేత్తలకు తెలుపడం లేదు. కేవలం సాధారణ జమాఅత్ సభ్యులకు ఉపదేశించు చున్నారు. ఈ అల్లాహ్ తాలా సామీప్య స్థాయికి చేరుకోవడం కోసం ఒక ప్రత్యేక స్థానం అవసరమని, ప్రతి ఒక్కరు ఆ స్థాయికి చేరుకోలేరని భావించకుము. వారు జమాఅత్ సభ్యులందరిని ఉద్దేశించి సాధారణంగా ఉపదేశించారు. మన జమాఅత్ వారందరు తమ మనస్సులను చంపుకోవాలి. ఆపై నిష్టాపరతను సాధించుకొనుటకు మొదట వారు అభ్యసం చేయాలి. ఏ విధముగానైతే ఒక బాలుడు మొదట్లో వ్రాస్తున్నప్పుడు అతని వ్రాత వంకర టింకరలుగా పోవునో, కాని చివరికి ప్రయత్నించగాస్వయముగా వారే చక్కటి మరియు వరుస క్రమములో వ్రాయడం ప్రారంభిస్తారు. అదే విధముగా వారు కూడ అభ్యాసం చేయాలి. వారి అభ్యాసంను చూసినప్పుడు అల్లాహ్ తాలాయే స్వయముగా వారిని కనికరించును. ఈ విషయం కూడ ముందుగానే ప్రస్తావించబడింది. వల్లజీనా జాహదు ఫీనా సూక్తిని మిక్కిలి విశ్లేషిస్తూ ఈ విధముగా తెలుపడం జరిగింది. వల్లజీనా జాహదు ఫీనాలో పేర్కొన్న జాహదు అనగా ఈ అభ్యాసమే. మానవుడు శ్రమించాలి. అల్లాహ్ తాలాతో దుఆలు చేయాలి. అప్పుడే అల్లాహ్ తాలా కరుణించును. ఆ శ్రమకు ప్రతిఫలములను అందించును. మరల ఇట్లనిరి. పై సూక్తిలో కృషి అనగా ఈ అభ్యాసమే. ఒక బాలుడు అభ్యాసం చేసినట్లుగా, ఒకవైపు దుఆ చేస్తుంటారు, మరోవైపు ప్రణాళిక బద్ధమైన ఉపాయంను ఆలోచిస్తుంటారు. చివరికి అల్లాహ్ తాలా వారికి అనుగ్రహిస్తాడు. ఫలితముగా వారి మనస్సులో ఉన్నటు వంటి ఉత్సాహం, ఉరుకులు పరుగులు అన్ని అణిగిపోతాయి, చల్లబడుతాయి. వారి స్థితి ఎలా ఉంటుంది అనగా

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

**ఇమామ్ వాక్యములు**

మీకు ఇహలోక పరలోక సాఫల్యము కలగాలని, ప్రజల హృదయాలను జయించాలని మీరు ఆశించుచున్నచో పవిత్రతను ఆచరించుము. తమను తాము చక్కదిద్దుకొని ఇతరులకు ఆదర్శముగా నిలువగలరు. అప్పుడు మీరు సఫలమగుదురు." (ఖుత్బా జుమా 1 జనవరి 2016)

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

రగులుతున్న నిప్పుపై నీళ్ళు చల్లినట్లుగా ఉండును. అనేక మంది వ్యామోహపూరిత మనస్థత్వంలోనే మునిగిపోయి ఉంటారు.”

మరల జమాఅత్ అంతర్గత సంస్కరణ కొరకు వారిట్లు తెల్పిరి.

“జమాఅత్ సభ్యులలో పరస్పరం విభేదాలు ఉండడంను నేను చూస్తున్నాను. పరస్పరం తగువులాడు కోవడం, తగాదలు పడడం, కోపతాపాలు పెంచుకోవడం, వేరైపోవడం వంటివి జరుగుతున్నాయి. చిన్న చిన్న విషయాలకే ఒకరు మరొకరి గౌరవంపై దాడి చేస్తుంటారు. తమ మిత్రునితో తగాదలాడు తుంటారు. ఇదిచాలా అయిష్టమైన పని. ఇలా ఉండకూడదు. ఎవరైన ఒకరు తమ తప్పిదాన్ని అంగీకరించినచో ఏం అవుతుంది?. కొందరు చిన్న చిన్న విషయాలకే ఇతరులను అవమానించే పనిలో ఉండిపోతారు. ఇలాంటి వ్యవహారాల నుండి పూర్తిగా దూరముగా ఉండాలి. దేవుని పేరు సత్తారు. అలాంటప్పుడు వీరు తమ సోదరునిపై ఎందుకు కనికరం చూపరు. క్షమించడం, తప్పిదాన్ని కప్పిపుచ్చడం వంటివి ఎందుకు చేయడం లేదు. సాధ్యమైనంత వరకు తమ సోదరుల తప్పిదాలను కప్పిపుచ్చవలెను. వారి గౌరవంపై, వారి మర్యాదలపై దాఢి చేయకూడదు.”

మరల ఇట్లు తెల్పిరి. “ఇప్పటి వరకు మన జమాఅత్‌లో అనేక మంది వారికి వ్యతిరేకమైన ఏ చిన్న మాట విన్నను వారు వెంటనే కోపతాపాలకు గురవుతుంటారు. వారిలో ఉద్రేకం పెల్లుబీకుగను. వాస్తవానికి ఇలాంటి ఉద్రేకములన్నింటిని వదిలి వేయడమే ఉత్తమం. వాటిని అంతమొందించాలి. అప్పుడే సున్నితత్వం, మృదు స్వభావం వారిలో జనించును. మరల ఇట్లనిరి. సాధారణముగా మన దృష్టికి ఇలాంటి విషయాలు కూడ వస్తుంటాయి. ఒక చిన్న విషయంలో చర్చలు జరుగుచున్నప్పుడు ఒకరు మరొకరిని ఓడించే ఆవేధనలో ఉంటారు. ఏ విధముగా నేను నా ప్రత్యర్థిని ఓడించగలను. ఏ విధముగా నేను విజయంను సాధించగలను. ఇలాంటి సమయంలో మనో ఒత్తిడి నుండి రక్షించుకోవాలి. ఒక అలజడిని దూరం చేయడం కోసం చిన్న చిన్న విషయాలను చూసి చూడనట్లుగా వదిలి వేయాలి. ఓటమిని అంగీకరించాలి. అంతేగాని తన సోదరుడిని అవమాన పర్చాలని మాత్రం చూడకూడదు. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 341-342).

మరల ఇట్లు తెల్పిరి.“ ఇదొక పెద్ద జబ్బుకు మూలము. ఇతరుల లోపాలను గూర్చి ప్రచారం చేయడం ఒక విధమైన జబ్బు. మరల ఇట్లు తెల్పిరి. తమ సోదరునిపై విజయం సాధించాలనే ఆలోచన ఈర్షపూరితమైనది. ఈర్షపూరితమును గూర్చి ముందే తెలుపడం జరిగింది. ఫలితముగా ఇతరుల తప్పిదాలను ప్రచారం చేయడం జరుగుతుంది. మరల ఇలా వివరించడం జరిగింది. తన సోదరుడిపై విజయం సాధించాలనే ఆలోచనల ఈర్షపూరితమైనది. ఇదొక పెద్ద జబ్బులాంటిది. ఈ జబ్బు తన సోదరుని లోపాలను ఇతరులకు తెలియజేయాలనే ఆలోచనలను కల్గిస్తుంది. మరల ఇలా తెల్పినారు. ఇలాంటి విషయాల వలన మనస్సు చెడిపోతుంది. కావున వీటి నుండి దూరముగా ఉండాలి. మొత్తానికి అన్ని అంశాలు నిష్టాపరతపై ఆధారపడి ఉంటాయి. అంతర్గత, బహిర్గత విషయాలలో కూడ నిష్టాపరతను పాటించువారు దేవదూతలలో పరిగణించబడుతారు. ఎందుకనగా వారిలో ఎలాంటి కుట్ర స్వభావం ఉండదు. నిష్టాపరతను సాధించుము. ఎందుకనగా నిష్టాపరతను సాధించిన తరువాతయే శుభములు లభించును. నిష్టాపరుడు ప్రాపంచిక ఆపదల నుండి కాపాడబడును. అల్లాహ్ తాలా వారి తప్పిదాలను కప్పిపుచ్చును. ఈ విధానాన్ని అనుసరించనంత వరకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. అలాంటి వారు నా బైఅత్ చేసినను ఎలాంటి ప్రయోజనంను పొందలేరు.”

మరల ఇట్లనిరి. “గుర్తుంచుకొనుము. మాట పూర్వకముగా బైఅత్ చేసినచో దానికి ఎలాంటి విలువ లేదు. అల్లాహ్ తాలా పరిశుద్ధమైన మనస్సును కోరుకుంటాడు. మరల ఇట్లనిరి. ఎలాంటి ప్రయోజనం చేకూరదు. ప్రయోజనం పొందాలని చూసినచో ఎలా ప్రయోజనం పొంద గలడు. అప్పటికే అతనిలో దౌర్జన్య స్వభావం గలదు. ఒకవేళ ఇతరులలో ఉన్నట్లుగా వీరిలో కూడ ఉద్రేకం, ఈర్ష, గర్వం, హేళన, ప్రదర్శనతత్వం, ఆవేశం వంటివి ఉన్నచో ఇరువురికి తేడా ఏ ముంది?.”

ఈ విషయమును గూర్చి మరల ఈ విధముగా వివరముగా తెలుపడం జరిగింది. అందుకే తమ తమ మనస్సులను పరిశుద్ధము చేసుకోండి, గుణగణాలను అలవర్చుకొనుటలో ఉత్తమ ఆదర్శమును చూపండి. మరల ఇట్లు తెల్పిరి. ఒకవేళ సజ్జనుడు ఒక్కడే ఒక గ్రామములో ఉన్నచో ఆ గ్రామ ప్రజలందరు అతని ద్వారా అద్భుత మహిమల వలే ప్రభావితం చెందెదరు. పుణ్యాత్ముడు కావలెను, సజ్జనుడు కావలెను. ప్రజలకు ప్రయోజనంను చేకూర్చవలెను. తమ ఉద్రేకములను అదుపులో పెట్టుకొను వారు కావలెను. వినయం ఉండవలెను. అప్పుడే ప్రజలు అద్భుత మహిమల వలే ప్రభావితం చెందెదరు. ఇది కూడ ఒక ప్రచారం మార్గముగా నిలుస్తుంది. పుణ్య స్వభావం గల మానవుడు అల్లాహ్‌కు భయపడి పుణ్యమును ఆచరించినచో అతనిలో ఒక దైవ ప్రభావం కల్గుతుంది. ఫలితముగా దైవజనుడనే ప్రభావం ఇతరుల హృదయాలపై పడుతుంది. ఎంతటి శత్రుత్వం ఉన్నప్పటికి స్వయముగా వారు నెమ్మది నెమ్మదిగా ఆ దైవజనుడి అనుసరణలోకి వచ్చేదరు. ఆపై హేళన చేయుటకు బదులుగా వారి వైభవాన్ని కొనియాడడం జరుగుతుంది. ఈ ప్రభావం దేవుని నుండే వస్తుందనేది నిజమైన విషయమే. అల్లాహ్ తాలాయే తన వైభవంలో నుండే వారికి కొంత భాగంను అందించును. ఇది సజ్జనులు సంస్కారం అనబడుతుంది. కావున మరల గుర్తుంచుకోండి, చిన్న చిన్న విషయాలకే తమ సోదరులను భాదించడం సరికాదు. ఆఁ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉత్తమ గుణగణాలన్నింటికి మూలాధారము. నేడు ఈ చివరి కాలంలో అల్లాహ్ తాలా హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి గుణగణాలనే స్థిరపరిచెను. మరల ఇట్లు తెల్పిరి: ఒకవేళ మరల మొదట్లో ఉన్నట్లుగా రక్షసతత్వం ఉన్నచో చాలా విచారకరం, దురదృష్టం. అందుకే ఇతరులపై నిందలు మోపకూడదు. ఎందుకనగా కొన్ని సందర్భాలలో మానవుడు ఇతరులపై నిందలు మోపి స్వయముగా పట్టుబడుతాడు. ఒకవేళ ఆ లోపాలు అతనిలో లేకున్నను మీరు ఇతరులపై నిందలు మోపినచో మీరే స్వయముగా అందులో చిక్కుకుందురు. కాని ఒకవేళ వారిలో ఆ లోపాలు నిజానికి ఉన్నచో వారి విషయం అల్లాహ్‌కు వదిలి వేయాలి. అంతేగాని ఇతరులపై నిందలు మోపుటకు మీకు ఎలాంటి హక్కులేదు. ఒకవేళ వారిలో చెడు ఉన్నచో వారి వ్యవహారమును అల్లాహ్ చూసుకొనును. ఒకవేళ వారిలో ఆ చెడు లేకున్నను మీరు చెడు ఉన్నదని ప్రచారం చేసినచో ఆ చెడు తిరిగి మీపైనే పడుతుంది. మరల ఇట్లనిరి. తమ సోదరులపైనే అతి నీచమైన ఆరోపణలు చేయు అలవాటు కొందరికి ఉంటుంది. కావున ఇలాంటి విషయాలను వదిలి వేయాలి. మానవజాతికి ప్రయోజనం చేకూర్చుటకు ప్రయత్నించుము. మీ సోదరులపై సానుభూతిని


| ఇమామ్ వాఖ్యములు | “ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సా ధించరు” (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

దుఆ ఆశించువారు: *Mahmood Ahmad Babu sb, Ameer Zila, Mahaboob Nagar, (Telangana)*

| ఇమామ్ వాఖ్యములు | “ఇస్లాం నిజమైన విజ్ఞానమును ప్రసా రించును. తద్వారా మానవుని నేర జీవితము మృతి చెందును” (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 344) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

చూపుము. పొరుగు వారితో ఉత్తమముగా వ్యవహరించుము. మీ భార్యల పట్ల అద్భుతమైన వ్యవహారశైలిని ప్రదర్శించుము. అన్నింటిని మించి అన్యారాధన నుండి కాపాడుకొనుము. అదే నిష్టాపరతకు తొలి మెట్టు."

(సేకరణ: మల్ఫూజాత్ సంపుటి 6, పుట 340–344, అనుబంధం, ఎడిషన్ 1984)

మరల వారిట్లు తెల్పిరి. నిష్టాపరత అనగా చెడు యొక్క అతి సూక్ష్మ అంశాల నుండి కూడ పూర్తిగా దూరముండుట. కాని మరల గుర్తుంచుకొనుము. ఒక వ్యక్తి నేను సజ్జనుడిని, ఎవరి ధనమును అపహరించలేదు, మోసము చేయలేదు, దొంగతనం చేయలేదు, చెడు చూపులతో చూడలేదు, వ్యభిచారం చేయలేదు కావున నేను పుణ్యాత్ముడను అని భావించినచో అట్టి పుణ్యాత్ములను చూసి దివ్యదృష్టి గల సత్పుర్షులు నవ్వుకొందురు. ఎందుకనగా ఒకవేళ వారు పైన పేర్కొనబడిన చెడులకు బానిసలైనచో అనగా దొంగతనం, మోసం, వ్యభిచారం వంటివి చేసినచో శిక్షించబడుదురు. కావున దివ్యదృష్టి గలవారి దృష్టిలో ఇవి పుణ్యకార్యము లనబడవు. వీటికి ఎలాంటి విలువలు ఉండవు. నిజమైన, స్వచ్ఛమైన పుణ్యమేమనగా, మానవజాతికి సేవ చేయడం, దైవ మార్గములో పూర్తి సత్యతను, విధేయతను ప్రదర్శించడం, ఆపై అతని మార్గములో ప్రాణాలు అర్పించుటకు సిద్ధముగా ఉండడం. అందుకోసమే ఇక్కడ ఈ విధముగా పేర్కొనడం జరిగింది. ఇన్నల్లాహా మఅల్లజీన అత్తఖూ వల్లజీనా హుం ముహ్సినూన్ (అన్నహల్: 129) అనగా చెడు నుండి దూరంగా ఉంటూ, సత్కార్యములు చేయువారితోనే అల్లాహ్ తాలా ఉంటాడు. మరల బాగా గుర్తుంచుకొనుము. సత్కార్యములు చేయకుండా కేవలం చెడు నుండి దూరముండడం విశిష్టత అనబడదు."

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 241–242, ఎడిషన్ 1984)

మరల ఇలా తెల్పిరి. ప్రతి పుణ్యానికి, ప్రతి పవిత్రతకు మూలాధారము అల్లాహ్‌ను విశ్వసించడం. అల్లాహ్ తాలాపై విశ్వాసం ఏ స్థాయి మేరకు బలహీనముగా ఉండునో ఆ స్థాయి మేరకు సత్కార్యములలో కూడ బలహీనత, అలసత్వం ఏర్పడును. కాని విశ్వాసం పటిష్టమైనప్పుడే, అల్లాహ్ తాలాపై పటిష్టమైన విశ్వాసం ఏర్పడినప్పుడే సత్కార్యములు కూడ బాగుగా ఉండును. విశ్వాసం పటిష్టమైనప్పుడే, అల్లాహ్ తాలాను అతని పూర్తి లక్షణాల దృష్ట్య సంపూర్ణుడని విశ్వసించినప్పుడే ఆ స్థాయి మేరకు చెందిన ఒక అద్భుతమైన మార్పు మానవుని కార్యాచరణలో కనిపిస్తుంది. అల్లాహ్ తాలా యొక్క లక్షణాలపై పూర్తి నమ్మకాన్ని కల్గి ఉండాలి. అప్పుడు ఒక అద్భుత మార్పు కార్యాచరణలో ఏర్పడుతుంది. అల్లాహ్ తాలాను విశ్వసించువారు పాపములు చేయుటకు సహసించరు. ఎందుకనగా ఈ విశ్వాసం అతని వ్యామోహ శక్తులను, పాపపు ఆలోచనలను నశింపజేస్తుంది. మరల ఇట్లనిరి. ఒకవేళ ఎవరివైన కన్నులు తీసి వేసినచో అతడు ఆ కన్నులతో ఎలా చెడను చూడగలడు?. కన్నులతో ఎలా పాపం చేయగలడు?. అదే విధముగా ఒకవేళ ఎవరివైన చేతులు కోసివేసినచో అతడు చేతులతో చేయు పాపములు ఎలా చేయగలడు?. మరల ఇలా తెలుపబడెను. అదే విధముగా ఒక మానవ ఆత్మ సంతృప్తికర స్థితికి చేరుకున్నచో, ఆ సంతృప్తి కరమైన ఆత్మ వారిని గ్రుడ్డివారిని చేయును. అనగా వారి కన్నులలో పాపపు శక్తి ఉండదు. అతడు చూసినను చూడనట్లే. ఎందుకనగా కన్నులు పాపపు శక్తిని కోల్పోతాయి. అనగా అతడు చేసినను చెడు దృష్టితో చూడడు, పాపపు దృష్టితో చూడడు. కారణం అతని కన్నులు పాపపు శక్తిని కోల్పోతాయి. అతడికి చెవులు ఉన్నప్పటికి చెవిటివాడగును. అతడు వింటాడు, కాని చెడు వినుటకు ఇష్టపడడు. పాపమునకు కారకులను చేయు విషయాలను అతడు వినడు. ఈ విధముగానే అతని వ్యామోహ శక్తులు, తుచ్ఛమనోవాంచల శక్తులు లోలోపల నుండి కోల్పోవును. పాపములకు కారణమవునట్టి అతని శక్తులన్ని మరణిస్తాయి. ఫలితముగా అతడు ఒక శవంలాగా మారిపోవును. అతడు దేవుని ప్రీతికి అనుగుణముగానే వ్యవహరించును. అతని ఆదేశం లేకుండా ఒక్క అడుగు కూడ వేయలేడు. ఈ స్థితి దేవునిపై స్వచ్ఛమైన విశ్వాసం ఏర్పడినప్పుడే సాధ్యమవుతుంది. దీని ఫలితమగా అతనికి సంపూర్ణమైన సంతృప్తి లభిస్తుంది. మరల వారిట్లు తెల్పిరి. ఇదే మానవుని అసలైన గమ్యస్థానం కావలెను. మరల ఇట్లనిరి. ఈ విషయమును గూర్చి అనగా మానవుని అసలైన గమ్యస్థానం ఏది కావలెను? అనే విషయంను గూర్చి జమాఅత్ సభ్యులకు ఇలా తెల్పిరి. మన జమాఅత్ సభ్యులకు కూడ ఈ స్థాయి చాలా అనివార్యము. సంపూర్ణమైన సంతృప్తిని పొందుటకు సంపూర్ణమైన విశ్వాసం తప్పనిసరి. మరల ఇలా తెల్పిరి. అల్లాహ్ తాలాపై స్వచ్ఛమైన విశ్వాసంను కల్గి యుండడం మన జమాఅత్ సభ్యుల ప్రథమ కర్తవ్యం." (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 244–245)

మరల ఇలా తెల్పినారు: "అల్లాహ్ తాలా పవిత్రుడిగా చేయనంత వరకు ఎవరు కూడ పవిత్రులుగా మారలేరు. దేవుని ఆస్థానధ్వారముపై భక్తితో, విధేయతతో అతని ఆత్మ రోదించినప్పుడు దేవుడు అతని దుఆలను స్వీకరించును. అప్పుడే అతడు సత్యవంతుడగును. అప్పుడు అతడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ధర్మమును అర్థం చేసుకొను స్థాయికి చేరును. ఆ స్థాయికి చేరకుండా అతడు ధర్మము ధర్మము అని పలకడం, మరియు అతడు చేయునట్టి ఆరాధనలు మొ॥నవి కేవలం ఆచారపూర్వక ఆలోచనలే అనబడును. తమపూర్వికులను అనుసరించి, వారి నుండి విని ఆచరిస్తుంటాడు. తాత ముత్తాతలు చేసేవారు కావున నేను కూడ చేస్తున్నాను అనే స్థితిలోనే ఉండును. ఎలాంటి వాస్తవికత, ఆధ్యాత్మికత అతనిలో ఉండవు. "

(మల్ఫూజాత్ సంపుటి 6,పుట 228, ఎడిషన్ 1984)

ఇది నిష్టాపరత యొక్క ప్రామాణికము. ఇది ధర్మమును తెలుసుకొను మరియు అర్థం చేసుకొను, ఆచరించు ప్రామాణికము. దీనిని సాధించాలనే విషయం వైపే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు ఒక ప్రత్యేక శ్రద్ధను కనబర్చారు. ఇందుకై మనం ప్రయత్నించాలి. తమ ఆచరణల ద్వారా అల్లాహ్ తాలా సన్నిధిలో విధేయతతో మోకరిల్లుచూ అల్లాహ్ ! మేము ఈ ప్రామాణికమును సాధించు మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి నమ్మకాలపై పూర్తి స్థాయిలో ఆచరించు భాగ్యమును మాకు కల్పించుము


### హజత్ర్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు ఒక గొప్ప నిదర్శనము

وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْأَقَاوِيلِ۔ لَأَخَذْنَا مِنْهُ بِالْيَمِينِ۔ ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِينَ۔

అనగా కొన్ని విషయములను అతడు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) మా వైపు అంటగట్టి యుండినచో మేము అతనిని తప్పక కుడి చేతితో బంధించువారము. తరువాత నిశ్చయముగా మేము అతని మెడనరమును కోసివేయువారము. (అల్‌హాఖ్ఖహ్:45-47)

అహ్మదియ్యా జమాఅత్ స్థాపకులైన హజ్రత్ అఖ్దస్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ మహ్దీ మహూద్ అలైహిస్సలాం ఇస్లాం సత్యము, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో తన ఆధ్యాత్మిక బంధము గురించి అనేక సార్లు అల్లాహ్ తఆలా ప్రమాణము చేయుచు "నేను అల్లాహ్ తఆలా తరపున అవతరించినాను" అని చెప్పినారు. ఇటువంటి ఎన్నో ఉపదేశములను సమకూర్చి ఒక పుస్తకము

**"అల్లాహ్ ప్రమాణము"**

పేరిట ప్రచురించబడినది. ఈ పుస్తకమును పొందుటకు ఆసిక్త గలవారు క్రింది చిరునామా/ఇ మెయిల్ ద్వారాసంప్రదించి ఉచితముగా పొందగలరు.

Postal Address: Muhammad Javed Ahmad, H.No. 3-4-772, Opp: C.C.Shroff Hospital, BARKATPURA, KACHIGUDA, 500 027.
Mobile:98663 58609,75693 58609, email: javidashu123@gmail.com

అని అతని సహాయమును యాచించవలెను. మరల ఈ నిష్టాపరతను గూర్చి ఉపవాసములను గూర్చి వివరణాత్మకముగా తెలుపబడిన తదుపరి సూక్తులలో తెలుపబడింది. ఉపవాసముల మన్నింపులను, ఉపవాసములను సరిగా పాటించు అవకాశమును కల్పించును. అల్లాహ్ తాలా ఈ ఆశంను ప్రతి మానవునికి అతని విచక్షణపైనే వదిలి వేసెను. నిష్టాపరతతో వ్యవహరించాలనే నిబంధనతో వదిలి వేసెను. ఒకవేళ ఉపవాసములు పాటించు శక్తి లేనిచో, ఉపవాసములు ఉండునట్టి శక్తి లేని జబ్బుఉన్నచో, ఉపవాసములు ఉండకూడదని డాక్టర్లు చెప్పినచో అలాంటి వారు ఫిదియా చెల్లించవలెను. అంతేగాని సాకులు చూపుతూ ఫిదియా విధానంనకు దారులు తెరువకుము. మరల ఇట్లనిరి. సత్కార్యము ఆచరించుటకు విధేయత అనివార్యము. అల్లాహ్ తాలా ఏ విధముగా ఆ పనిని చేయాలని ఆదేశించాడు అని చూడాలి. కావున ఒకవేళ అతడు లోతుగా ఆలోచించి నిష్టాపరతపై నడుచుకుంటూ తను ఆత్మపరిశీలన చేసుకున్నచో ఉపవాసం ఉండడం శ్రేయస్కరమా? లేదా ఫిదియా చెల్లించడం శ్రేయస్కరమా? అనే విషయం అర్థమవుతుంది. అల్లాహ్ తాలా మరల ఈ విషయమును గూర్చి ఎంతో వివరముగా తెల్పినాడు. అనారోగ్యముగా ఉన్నప్పుడు, ప్రయాణంలో ఉన్నప్పుడు ఉపవాసంను పాటించకుము. ఎందుకనగా అల్లాహ్ తాలా ఇబ్బందికి గురి చేయాలని చూడదు. అనారోగ్యము నుండి స్వస్థత లభించినప్పుడు వదిలి పెట్టిన ఉపవాసములను పూర్తి చేయుము. ప్రయాణం చేయడం వలన తప్పిపోయిన ఉపవాసములను తరువాత రోజులలో పూర్తి చేయుము. ఫదియా ఇచ్చినను పూర్తి చేయవలెను. కావున అటు ఇటు తిరిగి మరల మొదటికే చేరడం జరుగుతుంది. కావున నిష్టాపరతతో ఆలోచించుము. దేవుని భీతిని కల్గి యుండుము. దేవుడు మన స్థితిగతులను బాగుగా ఎరుగును అనే విషయాన్ని దృష్టియందుచుకొని తీర్మాణం చేసుకోవాలి. ఫలితముగా అల్లాహ్ తాలా మీ కొరకు ఒక ఉత్తమమైన మార్గమును, మంచి ఫలితములను బహిర్గతం చేయును."

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పినారు: రమజాన్ వస్తుందని మనస్ఫూర్తిగా ఆనందించే వ్యక్తి, రమజాన్ వచ్చినచో ఉపవాసములు కొనసాగించవచ్చునని ఎదురుచూచే వ్యక్తి ఏదేని కారణం చేత అస్వస్థతకు గురై ఉపవాసములు పాటించనిచో అట్టివారు ఆకాశం నందు ఉపవాసముల ప్రతిఫలములను కోల్పోవడం జరుగదు. మరల ఇట్లనిరి. ఈ ప్రపంచములో అనేకులు సాకులను అన్వేషిస్తుంటారు. అనగా సాకులు చూపుతుంటారు. ఆపై ఏ విధముగానైతే తాము ప్రపంచీకులను మోసం చేయుచున్నామో అదే విధముగా దేవున్ని కూడ మోసం చేయవచ్చునని భావిస్తుంటారు. అనగా ప్రపంచీకులను మోసం చేస్తుంటారు, అదే విధముగా అల్లాహ్‌ను కూడ మోసం చేయవచ్చునని భావిస్తుంటారు. సాకులు అన్వేషించువారు స్వయముగా సమస్యలను కొని తెచ్చుకుంటారు. స్వయముగా వారే సమస్యలను, ఇబ్బందులను కొని తెచ్చుకొని వాటిని సరైనవిగా చూపుతారు. మధ్యలో ఇబ్బందులను జోడిస్తూ ఇలా జరిగింది, అలా జరిగింది అని వాపోతారు. ఆపై ఉపవాసం ఉండకపోవడానికి గల సరైన కారణంను చూపినామని భావిస్తుంటారు. మరల ఇలా తెలిపెను. కాని వాస్తవానికి దేవుని దృష్టిలో అవి సరైనవి కావు. మోహమాటపు భాగం చాలా విశాలముగా ఉంటుంది. సాకులు చూపదలచినచో, కారణాలు చెప్పదలచినచో ఒకటికి రెండు దొరుకుతాయి. మరల ఇట్లనిరి: ఒకవేళ మానవుడు ఈ మోహమాటలనే ఆధారము చేసుకొని మానవుడు కోరినంత సమయం వరకు అనగా జీవితాంతము కూడ కూర్చొనియే నమాజ్ సలుపవచ్చును, ఉపవాసములు పాటించకుండ ఉండ వచ్చును. మరల ఇట్లనిరి. కాని అల్లాహ్ తాలా అతని సంకల్పమును, ఆలోచనలను బాగుగా ఎరుగును. అల్లాహ్ తాలా గోప్యతలను కూడ బాగుగా ఎరుగును. మన పాతాళం వరకు ఎరుగును. అతడు మన ఉద్దేశాలను, మన ఆలోచనలను కూడ బాగుగా ఎరుగును. మరల ఇట్లనిరి. ఎవరైతే స్వచ్ఛతను, సత్యతను కల్గి యుంటారో అల్లాహ్ తాలా కూడ వారితో అదే విధముగా వ్యవహరించును. సత్యతను, స్వచ్ఛతను చూపువారికి అదే విధముగా అల్లాహ్ తాలా ప్రతిఫలములనిచ్చును. సాకులను చూపువారితో వారికి అనుగుణముగానే వ్యవహరించును. ఎందుకనగా అల్లాహ్ తాలా సర్వంను ఎరుగును. మరల ఇట్లనిరి: సత్యతను స్వచ్ఛతను కల్గి యున్నవారి మనస్సులో ఒక ఆవేధన ఉన్నదనే విషయంను, సాకులు చూపు వారి మనస్సులో ఎలాంటి ఆవేధన లేదనే విషయంను అల్లాహ్ తాలా బాగుగా ఎరుగును. ఆవేధన కల్గి యుండడం ఒక గౌరవ సూచిక. అందుకే అల్లాహ్ తాలా వారికి అధికముగా అనుగ్రహిస్తాడు. సాకులు చూపు వారు మాటలు మారుస్తూ ఉంటారు. కాని అల్లాహ్ తాలా దృష్టిలో ఇలాంటి వారికి ఎలాంటి ప్రాధాన్యత ఉండదు. "

(మల్ఫూజాత్ సంపుటి 6, పుట 259-260)

కావున ఈ విధానాన్ని మనం ఎల్లప్పుడు మన ముందుంచుకోవాలి. అల్లాహ్ తాలా ఎంతో స్పష్టముగా ఈ విధముగా తెలియజేశాడు, ప్రయాణికులకు, అనారోగ్యులకు ఎలాంటి ఇబ్బంది లేదు. వారు తరువాత రోజులలో పూర్తి చేయవచ్చును. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విషయాన్ని కూడ తెల్పినారు. ఇలాంటి పరిస్థితులలో కూడ ఫిదియా చెల్లించడం తప్పనిసరి. ఫలితముగా ఉపవాసంను పాటించు భాగ్యము లభిస్తుంది. (మల్ఫూజాత్ సంపుటి 6, పుట 258)

నేడు వ్యాపిస్తున్నటు వంటి వైరస్ వలన కొందరు గొంతు ఎండిపోయే అవకాశం ఉంది, లేదా వ్యాధి సోకే అవకాశం ఎక్కువ ఉంది కావున ఉపవాసములు పాటించాలా? వద్దా? అని నన్ను ప్రశ్నిస్తుంటారు. ఈ విషయంలో నేను ఎలాంటి ఫత్వాను జారి చేయలేను. కాని ఈ విషయంలో సాధారణముగా నేను ఇచ్చు సమాధానమేమనగా, మీరు మీ పరిస్థితులను చూసుకుంటూ స్వయముగా మీరే నిర్ణయము తీసుకోగలరు. నిష్కల్మశమైన మనస్సుతో, నిష్టాపరతతో మీ మనస్సునే ఫత్వా అడుగండి. పవిత్ర ఖుర్ఆన్ ఎంతో స్పష్టముగా మార్గదర్శకం చేసింది. అనారోగ్యముతో ఉన్నచో ఉపవాసంను పాటించకుము. కాని అనారోగ్యమునకు గురి అవుతామనే భయంతో ఉపవాసములను వదిలివేయడం మాత్రం తప్పు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పినారు: ఒక కారణంతో మరొక కారణం, ఒక సాకుతో మరొక సాకు పుట్టుకొచ్చును. ఒకవేళ ఇలాంటి పరిస్థితులలో కష్టమవుతుందని డాక్టర్ సలహా ఇచ్చినట్లు ఎవరైన తెల్పినచో నేను కూడ అనేక మంది డాక్టర్లతో సంప్రదింపులు జరిపాను. డాక్టర్ల అభిప్రాయాలన్ని భిన్నముగానే ఉన్నాయి. కొందరు అనుభవం కల్గిన డాక్టర్లు మాత్రం ఉపవాసం ఉండడం వలన వ్యాధికి గురవుతామని ఖచ్చితముగా చెప్పలేమని, హాం ఒకవేళ వ్యాధి లక్షణాలు అనగా దగ్గు, తేలికపాటి జ్వరం వంటివి కనిపించినచో ఉపవాసంను వదిలి వేయవచ్చునని లేదా మరేవైన ఖచ్చితమూ లక్షణాలు కనిపించినచో ఉపవాసంను వదిలి వేయవచ్చునని లేదా ఒకవేళ ఉపవాసం పాటిస్తున్నచో ఈ లక్షణాలు వెలువడినప్పుడు ఉపవాసంను వదలివేయవచ్చునని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఉపవాసం పాటించకూడదని అభిప్రాయపడే మరి కొందరు డాక్టర్లు మాత్రం ఉపవాసం పాటించాలనుకునే వారికి కోసం కొన్ని నిబంధనలు తెలియజేశారు. చివరికి వాటి పర్యావసానం కూడ ఉపవాసాలు పాటించకూడదనే విషయం వద్దకే చేరుతుంది. వారు కూడ స్పష్టమైన మార్గదర్శకాలు చేయడం లేదు. ఒకవైపు భయపెడుతూనే మరోవైపు అహార మెలుకువలు పాటిస్తూ ఉపవాసాలు ఉండవచ్చునని సూచిస్తుంటారు. పేదవారు ఏ స్థాయి మేరకు అహార మెలుకువలు పాటించగలరు.

కావున విభిన్న అభిప్రాయాల తరువాత ఉపవాసం పాటించుటలో ఎలాంటి సమస్య లేదనే విషయం నిర్ధారణకు వచ్చింది. హాం ఒకవేళ ఏ కొద్దిపాటి లక్షణాలు కనిపించిన వెంటనే ఉపవాసంను వదిలి వేయవచ్చును. కొందరు మాత్రం తమ ఇంట్లో వ్యాధి గ్రస్తుడు ఉన్నాడనే కారణంతో ఉపవాసం పాటించకుండా ఉండాలని ప్రయత్నిస్తారు. కాని ఇతర డాక్టర్లు మాత్రం వారి ఆలోచనలను ఏకీభవించడం లేదు. మొత్తానికి ఉపవాసం ఉ

ంటున్నప్పుడు, ఉపవాసం వీడుతున్నప్పుడు అధికముగా మంచినీటిని త్రాగవలెయును. తమను గూర్చి అధిక చింతన గలవారు మరియు స్థోమత గలవారు ఒక రోజు మొత్తం తమశరీరంలో నీటి శాతంను అదుపుచేయునట్టి అహార పదార్థాలను తీసుకోవచ్చును. మొత్తానికి డాక్టర్ల అభిప్రాయాలు భిన్నముగా ఉన్నప్పుడు, ఈ డాక్టర్లలో అమెరికాకు చెందిన వారు గలరు, జర్మనీకి చెందిన వారు గలరు, ఇంగ్లాండ్‌కు చెందిన వారు గలరు. కావున అనవసరముగా భయాందోళనకు గురై ఉపవాసములు ఉండకూదదని భావించేవారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పినట్లుగా సాకులను చూపు పరిదిలోకి వస్తున్నారా? లేదా? అని కూడ చూసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రతలు పాటించాలి. కిందరి నీటి శాతం చాలా తక్కువగా ఉంటుంది. సాధారణముగా వారు ఎక్కువగా నీటిని త్రాగరు. అయినా కూడ వారు ఉపవాసాలను పాటిస్తుంటారు. సాధారణ రోజులలో కూడ అధికముగా నీటిని త్రాగరు. చౌద్రీ నజీర్ హుస్సేన్ అనబడే మన జమాఅత్ యొక్క మహాత్ముడు ఉండేవారు. ఎండాకాలంలో కూడ రోజంతయూ తిరిగివచ్చేవారు. ఎప్పుడో ఒకసారి కొద్ది మోతాదులో మంచినీరు త్రాగేవారు, కొన్ని సార్లు మాత్రం త్రాగేవారు కాదు. కాని మేము మాత్రం బయటికి వెళ్ళి రాగానే మంచినీళ్ళు త్రాగేవారము. ఈ విషయమై వారిని అడుగగా, నాలో నీటి శాతమే తక్కువగా ఉన్నది అని సమాధాన మిచ్చేవారు. మొత్తానికి రకరకాల స్వభావాలు కల్గిన వారు ఉంటారు. కావున ఇలాంటి పరిస్థితులలో ఏ స్థాయి మేరకు తమ విషయంలో జాగ్రతలు తీసుకోవాలి? అనే విషయం మాత్రం వారి వారి పరిస్థితులు, స్వభావాలపైనే ఆధారపడి ఉంటుంది. కావున వారి మనస్సునే అడిగి నిర్ణయం తీసుకోవాలి.

దుఆలు కూడ చేయండి. ఉపవాసములు పాటించుటకు అనుగ్రహాన్ని కల్పించమని అల్లాహ్ తాలాతో దుఆలు కూడ చేయవలెను. ఈ రోజులలో ప్రత్యేకించి చాలా దుఆలు చేయవలెను. అల్లాహ్ తాలా మానవజాతికి బుద్ధిని ప్రసాదించుగాకా!. అల్లాహ్ తాలాను వీరు గుర్తించుదురు గాకా!, అల్లాహ్ తాలా ఈ మహమ్మారిని త్వరగా ప్రపంచము నుండి అంతమొందించుగాకా!, ప్రపంచమును కరిణించుగాకా! అహ్మదీయులమైన మనమందరం కూడ నిష్టాపరతను అనుసరిస్తూ అల్లాహ్ మరియు అతని దాసుల హక్కులను చెల్లించువారలము కావలెను. రమజాన్ మాసపు శుభములన్నింటిని అధిక మోతాదులో సమకూర్చువారలము కావలెను. ప్రస్తుతం నెలకొంటున్న ప్రపంచ పరిస్థితులను కూడ ఎప్పటికప్పుడు అధ్యాయణం చేయాలి. ఈ మహమ్మారి వలన ప్రపంచ ఆర్థిక స్థితిగతులన్ని తలక్రిందులవుచున్నాయి. నేడు ఎదురవుచున్నటు వంటి ఆర్థిక పరిస్థితులు ఎదురైనచో యుద్ధాలు జరిగే అవకాశాలు కూడ ఎక్కువగా ఉంటాయి. అనేకమంది విశ్లేషకులు ఈ విషయాన్ని గూర్చి చర్చిస్తున్నాయి. ఆపై ప్రాపంచిక ప్రభుత్వాలు తమ స్వప్రయోజనాలను పొందడం కోసం ప్రాపంచిక కారణాలను చూపుతూ తమకు అనుగుణమైన విధానాలను ఎంచుకుంటాయి. ప్రజల దృష్టిని మళ్లించడం కోసం ఇలాంటి చర్చలు జరుపుతుంటారు. ఫలితముగా అవి వారిని మరిన్ని కష్టాలకు గురి చేయును. అలా ఇంకా ఎక్కువ వినాశనం వైపు వీరు అడుగులు వేస్తుంటారు. నేను ముందుగా తెల్పినట్లుగా సమీక్షలు నిర్వహించువారు కూడ ఇందుకు అనుగుణముగానే సమీక్షలు నిర్వహిస్తుంటారు. కావున అల్లాహ్ తాలా అగ్రరాజ్యాలకు బుద్ధిని ప్రసాదించుగాకా!, వారు విచక్షణతో వ్యవహరిస్తూ ప్రపంచాన్ని ఇంకా అధికముగా వినాశనం వైపు తీసుకవెళ్ళకుండా తగు నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతికలలో కూడ ఎంతో స్పష్టముగా ఈ విషయాలను, వారి సమీక్షలను ప్రచురించడం జరుగుతుంది. అమెరికా ఈరాన్‌ను భయపెడుతుందని, చైనాను నిందిస్తుందని, అది సరైన సమయంలో సరైన సమాచారాన్ని ఇవ్వలేదని, ఆ దేశంపై వ్యాజ్యము వేయాలని, ఆ దేశంతో ఈ విధముగా వ్యవహరించాలని, మేము ఈ విధముగా శిక్షిస్తాము, ఈరాన్ ఈ విధముగా శిక్షిస్తాము అని అమెరికా హెచ్చరిస్తున్నట్లుగా విశ్లేషకులు కూడ తెల్పుచున్నారు. మొత్తానికి అమెరికా కూడ విజ్ఞతతో వ్యవహరించాలి. ఇతర దేశాలు కూడ విజ్ఞతతో వ్యవహరించాలి. ఇలాంటి పరిస్థితులలో తప్పుడు నిర్ణయాలు తీసుకొని ప్రపంచాన్ని ఇంకా వినాశనం వైపు తీసుకవెళ్ళే బదులు, మంచి ఆలోచనతో, సరైన ప్రణాళికతో, దేవుని వైపు మ్రొగ్గుచూపుతూ, అతని ఆస్థానంలో మొకరిల్లుతూ, దేవునితో సహాయాన్ని యాచిస్తూ ఈ మహమ్మారి నుండి ప్రపంచాన్ని కాపాడుటకు ప్రయత్నించాలి. ఈ మహమ్మారి కోసం శాస్త్రవేత్తలు మందును కనుగోనుటకు ప్రయత్నిస్తున్నారు. కావున దుఆలు చేస్తూ, వారికి సహకరించుటకు ప్రయత్నాలు చేయాలి. అల్లాహ్ తాలా మనందరికి దుఆలు చేయు భాగ్యమును కల్పించుగాకా!, తమ తమ స్థితి గతులను పరీక్షించుకునే భాగ్యమును ప్రసాదించుగాకా!, ప్రపంచానికి, ప్రపంచములో ఉన్నటువంటి అగ్రరాజ్యాలకు తమ తమ కార్యాచరణలను రూపొందించుకునే, వాటికి అనుగుణముగా ఆచరించుకునే భాగ్యమును, వివేకంను కల్పించుగాకా!. (ఆమీన్).

**శుభప్రదమైన 30 రోజుల చాలెంజ్!**

రమజానుల్ ముబారక్ అనగా ఆధ్యాత్మిక వసంత ఋతువు.

నిష్టాపరుడిగా మారుటకు అమోఘమైన చిట్కా.

దేవుని సామీప్యతను పొందుటకు మరియు అతనితో అనుబంధమును పటిష్టము చేసుకొనుటకు సువర్ణ అవకాశం.

ఫిదియా మరియు ఫిత్రాన, జకాత్‌ల వైపు ప్రత్యేక శ్రద్ధ.

ఉపవాస ఉద్దేశాలు:

1) మనస్సును పవిత్రముగా చేసుకోవడం లేదా మనస్సును చక్క దిద్దుకోవడం.

2) ఆరోగ్య పరిరక్షణ.

3) సహనం, ధీరత్వ శక్తులను పెంపొంది ంచుకోవడం.

4) పేదల బాధలను అర్థం చేసుకొనుట.

5 ) సంపన్నులు మరియు క్రింది తరగతుల మధ్య సమన్వయ బోధనలు.

6) ప్రకాశించు హృదయం. (దివ్యదృష్టి శక్తిని పెంపొందించు కోవడం)

1- ఈ రమజాన్ మాసంలో పవిత్ర ఖుర్ఆన్ పఠనమును ఒక్కసారి అయినా పూర్తి చేయాలి.

2- ఖుర్ఆన్ చదవడం రాని వారు ఈ మాసంలో యస్సర్నల్ ఖుర్ఆన్‌ను పూర్తి చేయుటకైన ప్రయత్నించాలి.

3- అరబి భాషలో ఖుర్ఆన్ చదవడం రాని వారు తెలుగు భాషలోని అనువాదంను ఒకసారి పూర్తిగా చదవాలి.

4- ప్రతి రోజు అధికముగా దురూద్ షరీఫ్‌ను పఠించాలి.

5- ప్రతి రోజు కొన్ని నిమిషాలు ఏకాంతంలో కూర్చొని శక్తి వంతమైన సృష్టిని పరిశీలిస్తూ, దేవుని లక్షణాలను గుర్తుచేసుకుంటూ ఆయా లక్షణాలకు అనుగుణముగా దుఆలు చేసుకోవాలి.

6- తహజ్జుద్ మరియు ఇతర నవాఫిల్ నమాజ్‌లను క్రమం తప్పకుండా సల్పుటకు ప్రయత్నించవలెను.

7- ఈ రమజాన్ మాసంలో ఏదేని ఒక సత్కార్యమును అలవర్చు కోవలెను. అదే విధముగా మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు అడ్డుపడు తున్న ఒక చెడును వదిలివేయుటకు ప్రయత్నిం చవలెను.

8- అన్ని రకాల వృదా పనుల నుండి దూరముండవలెను.

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవిత చరిత్ర.**
**(హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కోసం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి త్యాగ స్ఫూర్తి.)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి వస్సలాం గారి పావనమైన జీవితంలో వెలుగొందు ప్రత్యేకమైన అంశం హజ్రత్ ముహమ్మద్ సల్లెల్లాహు అలైహి వస్సలాం గారి స్వభావమునకు చెందిన సులక్షణాల పట్ల అత్యంత ప్రేమాభిమానలు అనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నైజంలో అల్లాహ్ తాలా పై గల అభిమానం తరువాత, వారి ప్రియతమ నాయకుడి అభిమానమే ఇస్లాం చరిత్రలో మరొకరు కనిపించని స్థాయిలో ఒదిగి పోయినది. అంతే గాక వారి (అ) కి వారి ప్రియతమ నాయకుడు, ప్రవక్తలందరికి అధిపతి, దేవుని ప్రేమ స్వరూపుడు. హజ్రత్ అఖ్దస్ ముహమ్మద్ ముస్తఫా (స) గారి పట్ల త్యాగస్పూర్తిని, స్థాయిని చేరుకొనునంతగా అభిమానం కల్గియుండిరి.

మరొక విధముగా తెలుప దలచినచో ఆ మహ ప్రవక్త కోసం తన సర్వస్వంను అర్పించుటయే తన జీవిత లక్ష్యముగా భావించుకొనిరి. నిజమైన అభిమానమునకు కావలసిన అర్హతలన్నియు వారి (అ)లో గలవు. ఆ మహ ప్రవక్త అభిమానముతో వారి (అ) ప్రతి వెంట్రుక ముడిపడి యున్నది. లేదా ప్రవక్తల పట్ల అభిమానం, త్యాగ స్పూర్తిలో వారి(అ) పరిపూర్ణ ప్రావీణ్యత లభించినదని చెప్పుకోవచ్చును. ఇంతటి ప్రావీణ్యత నేటి వరకు ఏ ఒక్కరికీ కూడ లభించ లేదు, ఇకపై కూడ మరెవరికీ లభించదు. ఈ ప్రేమాభిమానాలు, ఆకాంక్ష వారి (అ) బాల్యం నుండి వారి అణువణువులో గలదు. వారు (అ) ఇట్లు తెలిపిరిః- అనగాః- ఓ రసూలుల్లాహ్ః- నేను పాలు త్రాగు వయస్సు నుండి నా అణువణువులో నీ అభిమానం ఒదిగి యున్నది. (ఆయినా కమాలాతే ఇస్లాం పుట;27)

అందువలనే యుక్త వయస్సు ఆరంభములోనే సత్య స్వప్నం ద్వారా వారికి తమ ప్రియతమ నాయకుడు, సృష్టికారకుడు హజ్రత్ ముహమ్మద్ (స) గారిని దర్శించుకునే భాగ్యము లభించినది. ఆ దర్శనభాగ్యం తరువాత నుండి వారి జీవితపు చివరి క్షణం వరకు ప్రవక్తగారి అభిమానంలో లీనమై జీవితంను గడిపిరి. (సీరతుల్ మహ్ది సంపుటి; పుట 550, రివాయత్ సంఖ్య 572) ప్రవక్త గారి ఆస్థానంలో ప్రథమ ప్రవేశంను గూర్చి అత్యంత అద్భుతముగా వర్ణించుతూ వారు (అ) ఇట్లు తెల్పిరిః-

యుక్త వయస్సు ప్రారంభ సమయంలో ఒక రాత్రి స్వప్నంను చూపాను. ఆ స్వప్నంలో నేను ఒక విలాసవంతమైన భవనంలో యున్నాను. అది చాలా పరిశుభ్రముగా, అందముగా యున్నది. ఆ భవనములో హజ్రత్ ముహమ్మద్ (స) గారిని గూర్చి చర్చించు కోసాగిరి. అచట ఉన్న జనులతో హుజుర్ గారు ఎక్కడు న్నారని నేను ప్రశ్నించితిని. వారు ఒక గది వైపు సంజ్ఞ చేసిరి. నేను ఇతరులతో కలసి ఆ గదిలోకి ప్రవేశింతిని. నేను హుజుర్ (స) గారి సన్నిదికి చేరుకోగానే హుజుర్ (స) గారు నన్ను చూసి చాలా ఆనందించిరి. వారి అంద చందాలు, వారి మృదుత్వము, వారి ప్రేమా, ఆప్యాయతలో కూడిన చూపులు నేటి వరకు నాకు గుర్తున్నవి. వాటిని నేను ఏన్నడు మర్చిపోలేను, వారి ప్రేమ నన్ను ఆకర్షించినది. వారి అందమైన రూపురేఖలు నన్ను వారి అభిమానిగా మార్చి వేసినవి. (ఆయినా కమాలితే ఇస్లాం, 546)

శ్రోతలారా!. ఈ దర్శనంలో దైవ ప్రవక్త ముహమ్మద్-ఎ-అరబీ (స) యొక్క తేజోవంతమైన ముఖము వారి (అ) ని ఎంతగా ఆకర్షించి నదనగా వారు (అ) శాశ్వతముగా హుజుర్ గారికి అంకితమైపోయిరి. వారు (అ) తమ ప్రపంచమునే మరచి పోయిరి కాని, ఇంత వైభవోపేతమైన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వెలుగును మరచి పోలేక పోయిరి. వారి (స) స్పర్శలన్నింటిని చివరికి వారి హృదయము, మేధస్సును కూడ వారి ప్రియతమ నాయకుడి ఇష్టాను సారమే మలిచివేసిరి. అంతేగాకా తమ కంటూ ప్రత్యేకతయే లేనట్లుగా మహ ప్రవక్త పట్ల విధేయతను ప్రదర్శించితిరి. తమ ప్రియతమ నాయకుడిని అనుసరించగా కలుగు శుభములను గూర్చి వారు (అ) ఇట్లు తెల్పిరిః-

" అల్లాహ్ తాలా హజ్రత్ ఇబ్రాహీం (అ), ఇస్హాక్ (అ), ఇస్మాయిల్ (అ), యాఖూబ్ (అ), యూసూఫ్ (అ), మూసా (అ), మరియమ్మ కుమారుడైనా ఏసుక్రీస్తుతో సంభాషించినట్లు, సంబోధించినట్లుగానే మన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారితో కూడ సంభాషించినాడని, సంబోధించినాడని, మరియు వారిపై అత్యంత తేజోవంతమైన, పావనమైన వాణి అవతరించినదని, అదే విధముగా నాకు కూడ ఆ విధమైన సంభాషణ, సంబోధన భాగ్యమును కూడ కల్గింపజేసినారని, కాని నాకు ఈ భాగ్యము కేవలం హజ్రత్ ముహమ్మద్ సలల్లాహు అలైహి వసల్లం అనుసరణ వలనే లభించినదని నేను ప్రమాణ పూర్వకముగా తెల్పుచున్నాను. ఒక వేళ నేను హజ్రత్ ముహమ్మద్ సలల్లాహు అలైహి వసల్లం సమాజమునకు చెందిన వాడిని కానిచో, నా సత్కార్యములన్ని పర్వతములకు సమనాముగా యున్నా కూడా నాకు ఆ సంభాషణ, సంబోధన భాగ్యము లభించి యుండేది కాదు.

(తజల్లియాతే ఇలాహీ, రూహని ఖజాయిన్ సంపుటి 20, పుట 411-412)

మేము సర్వమునంతయు వారి నుండే పొందితిమి. ఇందుకు నీవే సాక్ష్యం దేవుడా!

ఆ సత్యమును ప్రదర్శించినది కేవలం ఈ దర్శన భాగ్యము మాత్రమే. మరల ఇట్లనిరిః-

"నేను ఏ ఉపాధ్యాయుని నామమును ఎరుగను - ఎందుకనగా నేను కేవలం ముహమ్మద్ ముస్తఫా (స) గారి పాఠశాలలోనే విధ్యను అభ్యసించాను."

అదే విధముగా తమ ప్రియతమ నాయకుడి వైభవమును కీర్తించుతూ వారు (అ) ఎంతో ఘనముగా ఇట్లు తెల్పిరిః-

నా తల, ముహమ్మద్ (స) గారి కాలి దూళికై అర్పితమైనది.

నా హృదయము ఎల్లప్పుడు ముహమ్మద్ (స)కే అంకితమై యుండును.

ప్రవక్త (స) తల నీలాల సాక్షిగా చెబుతున్నా, నేను ముహమ్మద్ (స) యొక్క తేజోవంతమైన ముఖంపై అర్పితుడనైనాను. ఈ మార్గంలో నన్ను హతమార్చినా, కాల్చి వేసినా కూడ నేను వారి ఆస్థానం నుండి వెనుదిరగను.

మొత్తానికి హజ్రత్ ముహమ్మద్ (స) ప్రేమలో వారు (అ) పూర్తిగా లీనమైయారు. ప్రపంచము నా గూర్చి ఏమి అనుకుంటుంది?. నా గూర్చి ప్రజలుఏ విధముగా సంభాషించు కుంటున్నారనే చింతన కూడ వారికి ఏమాత్రం ఉండేది కాదు. కేవలం వారికి, వారి నాయకుని పట్ల స్వచ్ఛమైన ప్రేమ ధ్యాస మాత్రమే ఉండేది.

దేవుని తరువాత ఒకవేళ నేను ఎవరినైన ఆరాదిస్తున్నచో అది కేవలం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంగారినే.

అలా చేయడం ఒకవేళ అవిశ్వాసమైనచో ప్రపంచములో నాకన్న పెద్ద అవిశ్వాసుడు మరెవ్వరు లేరని నేను తెలుపుచున్నాను.

దేవునిపై గల ప్రేమ తరువాత నేను హజ్రత్ ముహమ్మద్ (స) ప్రేమలో లీనమైనాను. ఒక వేళ ఎవరి దృష్టిలోనైన ఈ విషయం అవిశ్వాసమైనచో దేవుని పై ప్రమాణం చేసి తెలుపుచున్నాను, ప్రపంచములో అందరికన్న పెద్ద అవిశ్వాసున్ని నేనే.

వాస్తవమేమనగా ప్రేమాభిమానాలు గల ప్రపంచంలో ఇది చాలా అరుదైన పంక్తి.

**అభిమానాలు, త్యాగములు, స్పూర్తిల, ఆధారముః-**

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ వార పత్రిక
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516 ఖాదియాన్
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 5. Thursday, 28 MAY 2020 Issue No. 22.

MANAGER
NAWAB AHMAD
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

ప్రియ శ్రోతాలారా! ప్రేమ, కస్తూరి సువాసన ఆ రెండు ఎంత దాచినా దాగవు. అన్ని చోట్ల వాటిని గూర్చి చర్చలు జరుగుతూనే ఉంటాయి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) హృదయములో తమ నాయకుడు హజ్రత్ ముమమ్మద్ అరబి సల్లల్లాహు అలైహి వసల్లం కోసం తమ ప్రాణాలను కూడ త్యాగం చేయుటకు సిద్ధపడునంత అభిమానం యుండెను. ఇందుకు ప్రపంచమే ఒక సాక్ష్యం. దైవదూతలు కూడ ఇందుకు సాక్ష్యమిచ్చిరి. తమ కుటుంబ సభ్యులు బందుమిత్రులు, ఇతరులందరు కూడ ఈ విషయన్ని అంగీకరించిరి. ఇదే ఆ ప్రేమాభిమానానికి చెరగని గుర్తింపు. అందువలనే అల్లాహ్! తాలా వారికి ఈ కాలపు మార్గదర్శకత్వపు బాధ్యతలను అప్పగించెను. అందుకే వారు ఇలా తెల్పిరిః-

“ఒక సారి నాపై దైవ వాణి అవతరించినది. దాని అర్థం ఏమిటనగా దైవదూతలు అన్వేషణలో ఉన్నారు. అనగా ధార్మిక పునరుద్ధరణ కోసం దైవాదేశముతో ఉత్తేజంలో ఉన్నారు. కాని ఆ కార్య నిర్వహణ కోసం సరైన వ్యక్తిని పొందలేక పోతున్నారు. అందుకే వారు అన్వేషించ సాగిరి. ఆ అన్వేషణలోనే నేను ఒక స్వప్నములో ఈ విధముగా చూసాను, కొందరు ఒక శ్రద్ధాలుడి కోసం అన్వేషించ సాగిరి. వారిలో ఒక వ్యక్తి నా ముందుకు వచ్చి నా వైపు సంజ్ఞ చేయుచు “హజ రజులున్ యుహిబ్బు రసూలుల్లాహ్” అనగా ఈ వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల అమితమైన అభిమానమును కల్గియున్నాడని తెల్పెను. ఈ పదము యొక్క భావం ఏమనగా ఈ కార్యనిర్వహణ కోసం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమను కల్గియుండుట అనివార్యము. కావున ఆ అర్హత ఈ వ్యక్తిలో గలదు.

(బరాహీనే అహ్మదియ్య భాగం 4, రూహని ఖజాయిన్;598)

ఇతరుల సాక్ష్యం కోసం బాబు ముహమ్మద్ ఉస్మాన్ లక్నవి గారి ప్రసంగాన్ని ప్రవేశ పెట్టుచున్నాను. వారు 1918 సం॥లో ఖాదియాన్ వచ్చి ఒక హైందవ వ్యక్తి లాలా బడామల్, లేదా బహుశా లాలా మలామల్‌ను కలిసిరి, వీరి ఇరువురి పేర్లు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రచనలలో మనకు అనేక మార్లు మనకు తారస పడుతుంటాయి. మీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను బాల్యం నుండి చూసినారు కావున వారి వ్యవాహారశైలి ఎలా యుండెను? అని ప్రశ్నించిరి. అందుకు వారు సమాధానముగా,

“నేటి వరకు తమ ప్రవక్త పట్ల ఇంత అభిమానం కల్గియున్నా ఏ ముస్లిం వ్యక్తిని నేను చూడలేదు”

(సీరతుల్ మహ్ది భాగం 3, పుట 19)

అదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మొదటి భార్య సంతానము వలన కల్గిన కుమారులలో ప్రథమ కుమారుడు, ఖాన్ బహదూర్ అనే బిరుదును పొందిన క్రీ॥శ॥ మిర్జా సుల్తాన్ అహమ్మద్ గారు. డిప్టి కమిషనర్ అధికారం నుండి పదవి విరమణ పొంది, ప్రపంచములో తన కంటూ గొప్ప ప్రాముఖ్యతను సాధించుకొనిరి. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి వసల్లం గారి జీవితంలో వారిపై విశ్వాసం తీసుకు రాకున్నను, రెండవ ఖలీఫా గారి కాలంలో బైఅత్ చేసి అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి.

హజ్రత్ బషిర్ అహ్మద్ యం.ఏ (ర) గారు ఇట్లు తెల్పిరిః- వారు అహ్మదీయేతరులుగా ఉన్న రోజులలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి సులక్షణాలను, వారి అలవాట్లను గూర్చి తెలుసుకోవలనే కుతూహలం నాలో కల్గినందున, నేను వారిని ప్రశ్నించగా, అందుకువారు ఇలా సమాధానం ఇచ్చిరిః-

“నేను ప్రత్యేకించి నాన గారిలో (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి వసల్లం గారిలో) చూసిన విషయము ఏమనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి వ్యతిరేకముగా చిన్న మాటను కూడ సహించే వారు కాదు. ఒక వేళ ఎవరైన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారికి వ్యతిరేకముగా చిన్న మాట మాట్లాడినను వారి (అ) ముఖం ఎరుపు రంగుగా మారేది. కోపం వలన కన్నులు బెదిరింపుగా చూసేవి. వెంటనే అక్కడి నుండి వారు వేళ్ళిపోయో వారు.(మరల ఇట్లనిరి) హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారిని, నాన్న గారు చాలా అభిమానించేవారు, ఇలాంటి ప్రేమను నేను మరోకరిలో చూడలేదు. ఇలా మిర్జా సల్తాన్ అహ్మద్ గారు ఈ మాటనే పదేపదే ఉచ్చరించేవారు”

(సీరాత్-ఎ- తయ్యిబా పుట 34, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు.)

అదే విధముగా హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు స్వయముగా ఇలా తెల్పిరిః- “నేను ఒకరోజు తప్పకుండా మరణించ వలసినదే, ఆ ఆకాశ చక్రవర్తిపై మనస్ఫూర్తిగా ప్రమాణం చేస్తు తెల్పునది ఏమనగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గూర్చి చర్చించు నప్పుడు, వారి (స) నామమును ఉచ్చరించు వేళలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కన్నుల వెంట నీరు దారలుగా కారక పోవడంను, నేను ఏన్నడు చూడలేదు. వారి (అ) హృదయము, మేథస్సు శరీరమంతయు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమలో మునిగి పోయినది.”

శ్రోతలారా! హజ్రత్ మౌలాన గులాం రసూల్ రాజీకి గారు, హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల మిర్జాగులాం అహ్మద్ గారికి గల ప్రేమాభిమానలను వీక్షించే అహ్మదీయ్యత్‌ను స్వీకరించిరి. వారికి హజ్రత్ మౌల్వీ ఇమామోద్దిన్ (ర) గారి సన్నిధిలో హజ్రత్ మసీహ్ మౌవూద్ సలల్లాహు (అ) రచనలలో ఒకటైన ఆయినా కమాలాతే ఇస్లాం, మరియు ఆ రచనలలో గల కొన్ని పద్యాల పుటలు లభించగా వాటిని చూసి వారు ఇట్లు తెల్పిరిః-

**ఉపదేశము : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

**“ మీరు నా ఈ మాటలను బహుశ ఎక్కడా విను భాగ్యము లేని ఒక వ్యక్తి వాగ్మూలాలుగా భావించి, ఆదర్శప్రాయముగా నిలుచునట్లుగా వాటిని ఆచరించుము......... ఒకవేళ మీరు ఇలా నడుచుకోలేక పోవుచున్నచో, ఆచరించలేక పోవుచున్నచో ఈ జమాఅత్‌లో చేరడం వెనుక ఉన్న మీ ఉద్దేశం ఏమిటో నాకు తెల్పండి?. నేను చాటు మాటు మార్పును ఆశించడం లేదు. బహిర్గతమైన మార్పును ఆశిస్తున్నాను.” (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 125)**

**SUFI AHMAD** Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz